పద్య మంజరి.

★

ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్, హైదరాబాదు.

BVP- 2068
8/5/18

20/69

పద్యామంజరి

లఘుటీక

విశేషాంశములు

వ్యాకరణము

అక్టోబరు 1962

ఆంధ్ర సారస్వత పరిషత్తు
హైదరాబాదు

ప్రతులు 2000

వెల రూ. 1-0-0

గోలకొండపత్రిక ప్రింటింగు ప్రెస్
హైదరాబాదు.

ముందుమాట

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించు ప్రవేశ పరీక్షకు చదువు విద్యార్థుల నుద్దేశించి ఈ పద్యభాగము కూర్పఁబడినది. బోధించువారలు లేని మారుమూల గ్రామాలలోనివారు స్వయముగ చదువుకొనుటకు వీలుగ నుండునట్లు కఠినముగాని పాఠ్యములను కూర్చి వానికి లఘుటీక, వ్యాకరణాంశములు చేర్చి ప్రకటించితిమి. ఈ కూర్పు పరీక్షార్థులకు సుబోధకముగ నుండునని విశ్వసించుచున్నాము.

గ. రామకృష్ణశర్మ
పరీక్షా కార్యదర్శి,
ఆంధ్ర సారస్వత పరిషత్తు

పద్యమంజరి

1. ప్రార్థన

ఉ॥ ఎవ్వనిచేఁ జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై
యెవ్వనియందు డిందు పరమేశ్వరుఁడెవ్వఁడు మూలకారణం
బెవ్వఁడనాది మధ్యలయుఁ డెవ్వఁడు సర్వము దానయైన వాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్॥ 1

కం॥ ఒకపరి జగములు వెలినిడి
యొకపరి లోపలికిఁ గొనుచు నుభయము గనుచున్
సకలార్థ సాక్షి యగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థి భజింతున్॥ 2

కం॥ లోకంబులు లోకేశులు
లోకస్థులుఁ దెగినఁ దుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుఁగు నతని నే సేవింతున్॥ 3

ఆ॥ ముక్తసంగులైన మునులు దిదృక్షులు
సర్వభూతహితులు సాధుచిత్తు
లసదృశవ్రతాఢ్యులై కొల్తురెవ్వని
దివ్యపదము వాఁడు దిక్కు నాకు॥ 4

కం॥ యోగాగ్ని దగ్ధకర్ములు
యోగీశ్వరు లేమహాత్ము నొందెదుఁగక స
ద్యోగ విభాసిత మనముల
బాగుగ వీక్షింతు రట్టి పరము భజింతున్॥ 5

—బమ్మెర పోతన—

2. సుభాషితములు

తే॥ గీ॥ బోద్ధలగువారు మత్సర పూర్ణమతులు;
ప్రబల గర్వ విదూషితుల్ ప్రభువు లెన్న;
నితర మనుజు లబోధోపహతులు; గాన
భావమున జీర్ణమయ్యె సుభాషితంబు! 1

తే॥ గీ॥ తివిరి యిసుమునఁ దైలంబుఁ దీయవచ్చు
తవిలి మృగతృష్ణలో నీరు ద్రావ వచ్చు
తిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు
చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు. 2

తే॥ గీ॥ సత్యసూక్తి ఘటించు, ధీజడిమ మాన్చు,
గౌరవ మొసంగు జనులకు, కలుష మడఁచు,
కీర్తి ప్రకటించు, చిత్తవిస్ఫూర్తిఁ జేయు
సాధు సంగంబు సకలార్థ సాధనంబు. 3

ఉ॥ ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్,
భూప సభాంతరాళమునఁ బుష్కల వాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమునం దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, ప్రకృతిజన్య గుణంబులు సజ్జనాళికిన్. 4.

తే॥ గీ॥ విద్యచే భూషితుండయి వెలయుచున్నఁ
దొడరి వర్జింప నగుఁ జుమీ! దుర్జనుండు
చారు మాణిక్య భూషిత శస్త మస్త
కంబు గల పన్నగము భయంకరము గాదె. 5.

తే. గీ. అర్కకాంత మచేతనంబయ్యు సవితృ
పాదములు సోఁకినంతనె ప్రజ్వరిల్లు
గాన నభిమానవంతుఁ డెందైన శత్రు
కృత తిరస్కార మెట్లు సహింప నేర్చు. 6

కం. విదళింప నుఱుకు సింగపుఁ
గొదమయు మదమలిన గండ కుంజరములపై
నిది బలశాలికి నైజము
గద! తేజోనిధికి వయసు కారణమగునే?

కం. దానము భోగము నాశము
పూనికతో మూడు గతులు భువి ధనమునకున్
దానము భోగము నెఱుగని
దీనుని ధనమునకు గతి తృతీయమె పొసగున్. 8

తే. గీ. తరువు లతిరసఫలభారగురుతఁ గాంచు
నింగి వ్రేలుచు నమృతంబు నొసఁగు మేఘుఁ
డుద్ధతులు గారు బుధులు సమృద్ధిచేత
జగతి నుపకర్తలకు నిది సహజగుణము. 9

మ. తమ కార్యంబుఁ బరిత్యజించియుఁ బరార్థప్రాపకుల్ సజ్జనుల్
తమకార్యంబు ఘటించుచున్ బరహితార్థవ్యాపృతుల్ మధ్యముల్
తమకై అన్యహితార్థఘాతుకజనుల్ దైత్యుల్ వృథాన్యార్థభం
గము గావించెడు వార లెవ్వరో? యెఱుంగన్ శక్యమే యేరికిన్ 10

శా. ఆశాసంహరణంబు, నోర్మియు, మదత్యాగంబు, దుర్దోషవాం
ఛాశూన్యత్వము, సత్యమున్, బుధమతాచారంబు, సత్సేవయున్,
వైశద్యంబును, శత్రులాలనము, మాన్యప్రీతియున్, ప్రశ్రయ
శ్రీశాలిత్వము, దీనులందుఁ గృపయున్, శిష్టాలికిన్ ధర్మముల్. 11

ఉ. రాతిరి మూషికంబు వివరంబొనరించి కరండబద్ధమై
భీతిలి చిక్కి యాసచెడి పెద్దయు డస్సిన పాముపాత సం
పాతముఁ జెందెఁ దానిఁ దిని పాము దొలంగె
బిలంబు త్రోవనే
యేతరి హానివృద్ధులకు నెక్కటి దైవము కారణంబగున్. 12
—ఏనుగు లక్ష్మణకవి

3. రాయన బాచఁడు

చ. కలయఁ బసిండి ఘంటమునఁ గాటయ వేమ
సమక్షమందు స
త్ఫలముగ రాయనప్రభుని బాచఁడు వ్రాసిన వ్రాల
మ్రోఁతలున్
గలుగలు గల్లు గల్లురనఁ గంటకమంత్రుల గుండె
లన్నియున్
జలుజలు జల్లు జల్లురనె సత్కవి వర్యులు మేలు
మేలనన్. 1

కం. పన్నిద్దరు భాస్కరులని
యెన్నిక సేయుటది కల్ల ఇద్దరు గాదా
మిన్నున నొక భాస్కరుఁడును
బన్నుగ వినుకొండ నున్న భాస్కరుఁ డొకఁడున్. 2

కం. పసముత్య మొకటి చాలును
కస వూడ్చిన చింపిరాలు గంపెండేలా!
రసికుం డొక్కఁడె చాలును
రసహీనులు పలువురేల? రాయనిబాచా! 3

కం. చేకొని రాయన బాచఁడు
కాకాలు గుణించు పిన్న కాలమునాఁడే
లాకేత్వ మియ్యనేరఁడు
చాకును కొమ్మియ్యఁ డిట్టి ధన్యులు గలరే? 4

ఉ. ఒక్కఁడు మాంసమిచ్చె, మరి యొక్కఁడు చర్మము గోసియిచ్చె, వే
ఱొక్కరుఁ డస్థినిచ్చె, నిఁక నొక్కఁడు ప్రాణములిచ్చె, వీరిలో
నొక్కొక పట్టునన్ బ్రదుకనోపక యిచ్చిరొ; కీర్తికిచ్చిరో
చక్కఁగఁజూడు మంత్రికుల సంభవ! రాయన మంత్రి భాస్కరా. 5

ఉ. ఏమి నిలింపశాఖి? పని యేమి సురేశ్వర? యీవి నిన్నుఁ జిం
తామణి మీరినాఁడఁటగదా మన రాయనబాచకోవిద
గ్రామణి; యౌర! యింతటనె కాదుసుమీ! విభవంబు నందు ని
న్నో! మతియందు నీ గురువునో! సుకుమారత నీ కుమారునో. 6

ఉ. సన్నుతలీలఁ బాండవులసంతతిఁ గర్ణుఁడు దాతగాక వా
రన్నలు దమ్ములందు నొకరైన వదాన్యులు గారు; కీర్తి సం
పన్నుని రాయనప్రభుని భాస్కరుసంతతి నెంచిచూడ వా
రన్నలు దమ్ము లింటఁ గలయందరు దాతలు భూతలమ్మునన్. 7

కం. మీఁగాళ్ళ బంటి నీళ్ళకు
వీఁగుదు రమ్మక్క యనుచు వెరపున వనితల్
చాఁగి పయోధులు దాఁటెను
బాఁగై నీ కీర్తికాంత రాయనిబాచా! 8

చాటు పద్యమణి మంజరి.

కీ। శే।। వేటూరి ప్రభాకరశాస్త్రి గారిచే
సంపాదితము.

4. ఉంగరము

గీ. పడతి! నీఱేని కూరిమిబంటు, నతఁడుఁ
దమ్ముఁడును దాను మాల్యవంతమ్మునందు
తమ్ము వలగొని కోఁతి మొత్తమ్ము లెల్ల
నోలిఁగొలువంగ నెమ్మది నున్నవాఁడు. 1

కం. ఓ చాన! యానవాలుగ
నాచే నీ యుంగరంబు నలువుగ నీ కా
రాచూలి పనిచె; నిదిగో!
చూచు కొనుమటంచు నెలమిఁ జూపించుటయున్. 2

గీ. డెంద మిగురొత్త నమ్మోలి కుందనంపు
టుంగరము దనమగని చేయుంగరంబు
గా నెఱింగియు, నమ్మక, వానిఁ జూచి,
యన్నుతలమానికం బిట్టు లనుచుఁ బలికె. 3

గీ. అన్న! యేప్రొద్దుఁ డక్కరులగు కడింది
పొలసు దిండులచేతి చెట్టలఁ గలంగు
చున్న కతమున నెకిమీని యుంగరంబు
గన్గొనియు లోన నమ్మిక గలుగ దిపుడు. 4

గీ. ఎవ్వడవు నీవు? నీకుఁ బేరెద్ది? యెట్లు
పుడమిఱేనికి నీకును బొందు బెరసె?
నద్దొరల రూపులెట్టి? విం దనుచు నపుడు
సామి ననుఁగూర్చి నీతోడ నేమి పలికె? 5

కం. ఏకరణి కడలి దాఁటితి?
వీకడ కేపగిదిఁ ద్రోవ యెఱిఁగితి? వెట్లీ
రాకాసుల మొఱఁగితి? విక
నీ కల తెఱఁగెల్ల మాకు నిక్కము చెపుమా. 6

కం. అనవుఁడు, నతఁడప్పాలికిం
గనుఁగొని, యిట్లనుచుఁ దెల్పెఁ గడఁగెం దల్లీ !
విను మేఁ జలినట్టు కతం
బున నంజన యనెడు చెలికిఁ బుట్టిన వాఁడన్. 7

కం. హనుమంతుఁ డనెడి పేరం
దనరారెడు వాఁడఁ, దొవలదాయ యనుఁగు బి
డ్డనికిం గడు నెయ్యుఁడ నీ
పెనిమిటికిం గూర్చునట్టి బిరుదు మగండన్. 8

కం. ఆ కోఁతులదొర దనుఁబలు
మూఁకలతోఁ గొలువనుండి ముద్దియరో ! యీ
రాకొమరుఁడు నిన్ వెదకుట
కై కొందఱ బంట్ల నేర్చి యనిపెడు నెడలన్. 9

కం. రంగుగ నాచేతికి నీ
యుంగర మిడి సెలవుపెట్ట, నుప్పొంగుచు, ను
ప్పుం గడలి దాటివచ్చి, ని
నుం గాంచితి నిచట వేడ్క నూల్కొనఁ బడఁతీ ! 10

కం. బల్లిదపుఁ గోఁతి మూఁకలు
పెల్లుగఁ దనుఁగొల్వ నీదు పెనిమిటి యిదిగో !
నెల్లిట నేఁటనో యచటికి
తల్లీ ! యరుదెంచు నింకఁ దలఁకకు మదిలో. 11

గీ. ఎఱచి యెరదిండి మన్నియ యిపుడు వచ్చి
నిన్నుఁ గఱకులు వలుకుచు నున్నయెడల
చాన ! యీ చెట్టుపై నుండి వాని దునుమ
తలఁచి, మరలితి నీకుఁ గీడెలయు నంచు. 12

ఉ. కల్లరిరక్కసుండు నినుఁగైకొని వచ్చినగోలె, బల్లిదం
బెల్లను దూలి, పూఁట యొక యేడుగఁ ద్రోయుచు
నబ్బురంపుబల్

తల్లడమూని, తిండియును దప్పియు, నిద్దురయుం
దొంగి జేఁ
డుల్లము దద్ద నీపయి నె యుంచి కలంగుఁజుమీ
పొలంతుకా. 13

గీ. "తడవు తే దిదె దండుతోఁ దరలివచ్చి
కడలి వడి దాఁటి రక్కసు నడఁచి నిన్ను
మరలఁ గైకొందు నుమ్మలింపకు" మటంచు
తెలుపుమనిపల్కె నతఁడు గ్రొందలిరుఁబోఁడి. 14

—కూచిమంచి తిమ్మకవి.

5. విద్యాభ్యాసము

సీ. తనయందు నఖిలభూతములందు నొకభంగి
సమహితత్వంబున జరుగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యునికై వడిఁ
జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన
మాతృభావన సేసి మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను
దీనులఁగావఁ జింతించువాఁడు

తే. గీ. సములయెడ సోదరస్థితి జరుపువాఁడు
దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు
లీలలందును బొంకులు లేనివాఁడు
లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁడధిప. 1

ఆ. సద్గుణంబులెల్ల సంఘంబులై వచ్చి
యసురరాజతనయు నందు నిలిచి
పాసి చనవు విష్ణుఁ బాయని విధమున
నేఁడుఁ దగిలియుండు నిర్మలాత్మ 2

మ. పగవాఱైన సురేంద్రులున్ సకలలోకం బ్రహ్లాదసంకా
శులన్
సుగుణోపేతుల నెందు నే మెఱుఁగ మంచున్ వృత్త
బంధంబులన్
బొగడం జొత్తురు సత్కవీంద్రులక్రియన్ భూనాథ
మీబోటి స
ద్భగవద్భక్తులు దైత్యరాజ తనయుం బాటించి కీర్తింపరే 3

కం. గుణనిధియగు ప్రహ్లాదుని
గుణము లనేకములు గలవు గురుకాలమునన్
గణుతింప నశక్యంబులు
ఫణిపతికి బృహస్పతికిని భాషాపతికిన్ 4

వ॥ ఇట్టు సద్గుణ గరిష్ఠుండైన ప్రహ్లాదుండు భగవంతుండయిన
వాసుదేవునియందు సహజ సంవర్ధమాన నిరంతర ధ్యాన రతుండై. 5

సీ. శ్రీవల్లభుఁడుదన్నుఁ జేరిన యట్లైనఁ
జెలికాండ్ర నెవ్వరిఁ జేర మఱచు
నసురారి దనముందల నాడిన యట్లైన
నసుర బాలురతోడ నాడమఱచు
భక్తవత్సలుఁడు సంభాషించి నట్లైనఁ
బరభాషలకు మాఱు పలుక మఱచు
సురవంద్యుఁ దనలోనఁ జూచిన యట్లైనఁ
జొక్కి సమస్తంబుఁ జూడ మఱచు

తే. హరి పదాంభోజయుగచింతనామృతమున
నంతరంగంబు నిండినట్లైన నతఁడు
నిత్యపరిపూర్ణుఁ డగుచు నన్నియును మఱచి
జడత లేకయు నుండును జడునిభంగి 6

వ॥ సుగుణమణి గణ గరిష్ఠుండును, బరమ భాగవత శ్రేష్ఠుండును నైన పుత్రునియందు విరోధించి సురవిరోధి యను కంపలేక చంపం బంపె ననిన నారదునకు ధర్మజుం డిట్లనియె. 7

శా. పుత్రుల్ నేర్చిన నేరకున్న జనకుల్ పోషింతు రెల్లప్పుడున్
మిత్రత్వంబున బుద్ధిసెప్పి దురితోన్మేషంబు వారింతురే
శత్రుత్వంబుఁ దలంప రెట్టియెడ నా సౌజన్య రత్నా
కరున్
బుత్రున్ లోకపవిత్రుఁ దండ్రి నెగులుం బొందింప
నెట్లోర్చెనో 8

ఉ. బాలుఁ, బ్రభావిశాలు, హరిపాదపయోరుహ
చింతనక్రియా
లోలుఁ, గృపాళు, సాధు గురులోక పదానత ఫాలు,
నిర్మల
శ్రీలు, సమస్తసభ్యనుతశీలు, విఖండితమోహ
వల్లికా
జాలు నదేల తండ్రి వడిఁ జంపఁగఁబంపె మునీంద్ర
చెప్పవే. 9

వ॥ అనిన నారదుం డిట్లనియె. 10

శా. లభ్యంబైన సురాధిరాజపదమున్ లక్షింపఁ
డశ్రాంతమున్
సభ్యత్వంబున నున్నవాఁ డబలుఁడై జాడ్యంబుతో
వీఁడు వి
ద్యాభ్యాసంబునఁ గాని తీవ్రమతి గాఁడంచున్
విచారించి దై
త్యేభ్యుం డొక్క దినంబునన్ బ్రియసుతున్ వీక్షించి
సోత్కంఠుఁడై. 11

కం. చదువని వాఁ డజ్ఞుం డగుఁ
జదివిన సదసద్వివేకచతురత గలుగుం

జదువఁగ వలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ. 12

వ॥ అని పలికి యసురలోక పురోహితుండయిన శుక్రాచార్యు కొడుకులఁ బ్రచండ వితర్కులఁ జండామార్కుల రావించి సత్కరించి యిట్లనియె. 13

శా. అంధప్రక్రియ నున్నవాఁడు వలుకం డస్మత్ప్రతాపక్రియా
గంధం బించుకలేదు మీరు గురువుల్ గారుణ్యచిత్తుల్ మనో
బంధుల్ మాన్యులు మాకుఁ బెద్దలు మముం బాటించి యీ బాలకున్
గ్రంథంబుల్ సదివించి నీతికుశలుం గావించి రక్షింపరే. 14

వ॥ అనిపలికి వారలకుఁ బ్రహ్లాదు నప్పగించి తోడ్కొని పొండనిన వారును దమజరాజ కుమారునిం గొనిపోయిరి. అతనికి సవయస్కులగు సహశ్రోతల నసుర కుమారులం గొందఱం గూర్చి. 15

ఉ. అంచిత భక్తితోడ దనుజాధిపగేహ సమీపమున్ బ్రవే
శించి సురారి రాజసుతుఁ జేకొని శుక్రకుమారకుల్ బఠిం
పించిరి పాఠయోగ్యములు పెక్కులు శాస్త్రము లాకుమారుఁ డా
లించి పఠించె నన్నియుఁ జలింపని వైష్ణవభక్తిపూర్ణుఁడై. 16

కం ఏపగిది వారు సెప్పిన
నా పగిదిం జదువుఁ గాని యట్టిట్టని యా
క్షేపింపఁడు దానన్నియు
రూపించిన మిథ్యలని నిరూఢమనీషన్. 17

—బమ్మెర పోతన

6. సత్యనిష్ఠ

ద్విపద ॥ తలఁదెంపు మని తెంపు దలకొనఁ బలికి
జలజాక్షి తనచీర చక్కనమర్చి
ప్రాణేశు వలగొని పదముల కెరగి
పాణిపల్లవములు భక్తితో మొగిచి 1

యనుదిన రక్త పంకారుణం బగుచు
గనుపట్టి జేవురు గట్టు చందమున
నున్న యావధ్య శిలోపరిస్థలిని
జెన్నారి చిఱునవ్వు సెలవిఁ దళుకొత్త 2

బద్మాసనంబునఁ బడఁతి గూర్చుండి
పద్మినీవల్లభు పైఁ జూడ్కి నిలిపి
“ లోకలోచన! సర్వలోకైకవంద్య!
నాకు వేవేల జన్మంబుల యందు 3

సతతపుణ్యుని హరిశ్చంద్రభూవిభుని
బతిగా నొనర్పుమీ! పార్థివేశ్వరుని
యాపదలన్నియు నడఁచి సత్యంబు
దీపింపఁ జేయు మీ తెఱఁగున ననుచు 4

వినయంబు నెక్కొన వేఁడి చిత్తంబు
తనపతిపైఁ జేర్చి, తలపొండు లేక,
యున్నంత బంధంబు లూడ్చి పోవైచి
యన్నరేంద్రుఁడు జగదాశ్చర్య మెసఁగు 5

శాత ధారాభీల చటుల ఖడ్గంబు
భూతముల్ భీతిల్ల ముష్టినమర్చి
బళిపించి జీవితేశ్వరి మెడ మోపి
కలఁగక తెగవ్రేయ గమకించు నంతఁ 6

క్రమ్మఱ నెడసొచ్చి ఖడ్గంబుఁ బట్టి
యమ్మనుజేశుతో ననియెఁ గౌశికుఁడు
చాలునోహో! యిట్టి సాహసకృత్య
మేల కైకొంటి నరేశ్వర! నిన్ను 7

వీక్షింప దోషంబు వివరింప మనుజ
రాక్షసుండవు గాక రాజవా! నీవు
క్రమమున ధర్మార్థ కామ మోక్షములు
నమర నీ కీఁదగునట్టి యీ సాధ్వి 8

జననుత సౌందర్య సంశోభితాంగి
నినుప ముల్కికి నేల యీఁదలంచెదవు
భువన విఖ్యాతమై పొలుపొందు నట్టి
రవి వంశమునఁ బుట్టి రాజసం బుడిగి 9

బతిమాలి పెనుమాల బంటవై నీచు
గతిఁ గాడు గాచు నీ కష్టంబు దగునె
కులసతి తలఁ దెగఁ గొట్టి యేలోక
ములకేగి సౌఖ్యంబు పొందఁ జూచెదవొ 10

యాలికై దక్షుని నడఁపఁడే శివుఁడు
పోలింప నీకంటె బుద్ధిహీనుండె?
సతిలేని గృహమేల? సౌఖ్యంబు లేల?
సతిలేని సుతులేల? సంపద లేల? 11

సతియుఁ గల్గినఁ గల్గు సకల ధర్మములు
సతియుఁ గల్గినఁ గల్గు సకల పుణ్యములు
అటుగాన విడువుమీ యాగ్రహ బుద్ధిఁ
గటకటా! నీ వివేకం బెందుఁ బోయె? 12

నామాటఁ గైకొని నా కుమారితల
నామాల మగువల నర్థి వరింపు.
నీసుతు ప్రాణంబు నీరాజ్య సుఖము
నీసతితోఁ బొందు నీతొంటి పెంపుఁ 13

బడయు మీవింక నీపదును దప్పినను
గడపట నీవు తెక్కలి జత్తు వనుచుఁ
బెక్కు చందంబులఁ బ్రియమును భయము
నెక్క బోధించు మునీంద్రునిఁ జూచి 14

పకపక నవ్వి 'యీ భవసాగరంబు
నొకదరిఁ జేర్చుచు నున్నాఁడు శివుఁడె
మును నీవు చెప్పిన బుద్ధులె కాక
వినఁ గ్రొత్త లేడివి వివరించి చూడ 15

సుతునొల్ల సతినొల్ల సురలోక మొల్ల
బతిమాలి నీవిచ్చు పడఁతుల నొల్ల
సత్యంబు గలిగినఁ జాలు వేయేల?
సత్యమే జయమని చాటు వేదములు 16

విడువు ఖడ్గంబింక వేంచేయు మిట్టి
యెడ నుండఁ జనదు మునీశ! నీవింక"
నావుడు వెఱఁగంది నరలోక నాథు
పావన సత్య సంపద కాత్మ నలరి 17

బొంకించు నాసలఁ బోవీడి మౌని
పొంకంబు చెడి తలపోయుచు నుండె
నప్పుడు దేవత లంబర వీధి
నుప్పొంగు వేడ్కల నువిదలుఁ దారు 18

బహురత్న దీప్తుల భాసిలుచున్న
మహనీయ దివ్య విమానంబు లెక్కి
వెఱఁ గంది క్రందుగా వీక్షించుచుండ
నెఱ దెంపునమై ధారుణీ తలేశ్వరుఁడు 19

భిదురంబు కంటెను బెడిదమై చదల
వదరులు సెదర భయంకర లీల
వాఁడు వాలెత్తియా వామాంఘ్రి కంఠ
నాళంబు తెగవేయ నది కలుక్కనఁగ 20

దాఁకిన వ్రేటు పూదండయై చెన్నుఁ
గైకొని పూఁబోఁడి గళమున నుండె. 21

—గౌరన

7. తెలంగాణ లక్ష్మి

సీ॥ శాతవాహనుల రాజ్యశ్రీకి ముత్యాల
గొడుగు పట్టుటకు ముందడుగు వేసి,
పులకేశి దక్షిణ భూ చక్రవర్తిత్వ
భాగ్యంబు నిల్పఁగా బౌజుదీగి,
రాష్ట్రకూటుల శౌర్యరమ మాల్య ఖేటాన
దీపింప రత్నాల దిమ్మె గట్టి
పశ్చిమ చాళుక్య ఖండన శతములం
దరివీర కంఠముల్ తఱిగిపోసి,

గీ॥ వీరవరులైన కాకతి బేతరాజ
ప్రోల రాజుల గెలిపింప వాలు దాల్చి
తరతరంబున శౌర్య బంధుర యశంబు
గన్న గుణభూమి మా తెలంగాణ సీమ. 1

మ॥ అదిగో! యాదవు, లల్లదే! హొయిసల వ్యాకీర్ణ సేనల్ మహా
మ్మదు గోరి తరివేచి దక్కను జయింపన్ వచ్చు నేమో యటం
చెద ఘూర్ణిల్లు తెనుంగువారి కభయం బీనెంచి సర్వాంధ్ర సం
పదఁ గాపాడిన కాకతీయులఁ దలంపన్ మేను కంపించెడిన్, 2

మ॥ సకలాంధ్రావని కొక్క శాసనముగా సామ్రాజ్య సంస్థాప నో
త్సుకుఁడై ఖడ్గముఁబట్టు శ్రీగణపతీంద్రుం గూడి కాళింగులన్
జకిత స్వాంతులఁ జేసి తక్కు దొరలన్ స్వాధీనమందుంచి కాం
చికి ముట్టన్ దమగుజ్జుముల్ నడిపి వాసింగాంచి రీదేశజుల్ 3

చ॥ గణపతి దేవు మించు రిపుఘస్మరుఁడైన ప్రతాపరుద్రు దా
రుణ మృతి తెల్గువారల కరుంతుదమౌ తఱి రాచకొండ భీ
షణ రణదుందుభుల్ మొరసె జాతి సముద్ధరణైకదీక్షఁ గం
కణమును గట్టి యెల్ల తెలఁగాణము నేలిరి పద్మనాయకుల్ . 4

గీ॥ 'తత్త్వ విద్యా కలాప' 'కవిత్వసార'
"జైన మస్తక విన్యస్త శాత శూల"
"కలిత బిజ్జల తలగుండు గండ" బిరుద
శోభితుఁడు సుమ్ము! పాల్కుర్కి సోమ సుకవి. 5

గీ॥ అరిది వేములవాడ భీమన్న సుకవి
పుట్టువునఁ బూతమై యొప్పి పురుడులేని
వైభవము గాంచు వెలిగంద లాభిధాన
మండలంబు తెలంగాణ మండనంబు. 6

ఉ॥ కమ్మని కైతలన్ బడుపుఁగత్తెలఁ జేయు కవీంద్రకోటి డెం
దమ్ములు లజ్జిలంగ నరనాథులనెల్లఁ దృణీకరించి మా
బమ్మెర పోతరాజు మృదుబంధము భాగవతమ్ము వ్రాసె నాం
ధ్రమ్ము మహాపురాణ మహితమ్మయి మేటి యశమ్ము
గాంచగన్. 7

గీ॥ దక్షిణాధీశ రచిత ముత్యాల శాలఁ
బసిఁడి వానలఁ దడసిన ప్రౌఢ కవికి,
రావు సింగ మహీపాలు రాచకొండ
జంకుఁ గలిగించి పైఁగప్పె రాంకవంబు. 8

గీ॥ కాళిదాసాది కవుల సత్కావ్యములకు
మహితటీకలు వ్రాసిన మల్లినాథ
సూరి "కొలిచల" మనియెడి సూరఁ బుట్టి
కాంచె నాసేతు శీతాద్రికలిత యశము. 9

గీ॥ సకలదేశ సమాగత సుకవి జనుల
నాదరించిన గద్వాల ఆంధ్ర వాణి
నెంత పూజించెనో వచియింపఁ గలమె?
బహుళ దాతలు శ్రీ ముష్టిపల్లి నృపులు. 10

గీ॥ తలఁప శ్రీశైల పశ్చిమ ద్వార మగుచు
వఱలి బ్రహ్మేశ్వరాఖ్యాన పరమ శివుని
కాపురంబున దక్షిణ కాశి యగుచుఁ
బొలుపు మీఱును మా అలంపూరు సతము. 11

గీ॥ త్రవ్వ కొలఁదిని రత్నాలు, తఱచు కొలఁది
వెన్నయును, గాఁచు కొలఁదియు జున్ను నగుచుఁ
దలపుఁ దలఁపునఁ గ్రొత్తలు పులకరించు
రాణ వెలుఁగొందు మా తెలంగాణ లక్ష్మి. 12

—శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి.

8. సంక్రాంతి

గీతమాల॥

దినకరుఁడు శాంతుఁడై తోఁచె, దినము లింత
కుఱుచలయ్యెను, జలిగాలి చుఱుకు హెచ్చెఁ
బొలములన్ రేల గ్రుడ్డి వెన్నెలల లోనఁ
గుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి
పదములన్ బాడఁ దొడఁగిరి, పచ్చపూల
జనుప చేలకు ముత్యాల సరులు గూర్చి
మన గృహమ్ముల ధాన్య సంపదలు నించి
సరసురాలైన పుష్యమాసంబు వచ్చె. 1

... ...

కోడితో మేలుకొని, తానమాడి నుదుటఁ
దిరుమణియుఁ దిరుచూర్ణంబుఁ దీర్చి దిద్ది,
యొక్క కేలను దంబుఱ నొక్క కేలఁ
జిఱుతలంబూని, నున్నని శిరముపైని
తొలఁగకుండ నక్షయ పాత్ర నిలిపి, మేలు
కొలుపులం బాడి వీధి వీధులను దిరిగి
గడప గడపకు నేగి భిక్షమ్ముఁ గొనుచుఁ
జేరవచ్చెను సాతాని జియ్య రడుగొ!
మేలుకొను మమ్మ నాతల్లి మేలుకొనుము. 2
తల్లి వేసిన ముగ్గు చెదరక మున్నె
గొబ్బిళులు చెల్లితోఁ బెట్టుకొందు గాని,
బంతి పూవులు, ముద్ద చేమంతి పూలు
గోసి యొడి నింపికొని తెచ్చుకొందు గాని,
తల్లిరో! దొడ్డిలోని సీతాఫలమ్ము
కోసియిచ్చెద రమ్మ! కుంకుమము బసుపు
గొబ్బెమ కలంకరించి మ్రొక్కుదుపు గాని,
నిన్ను దీవించు గొబ్బెమ్మ, కన్నతల్లి! 3

... ...

అన్ని పండువులందు ముఖ్యమిది గాన
నత్తవారింటి కేగుమో క్రొత్త పెండ్లి
కొమరుడా! అందు నీకు నెక్కుడు సుఖమ్ము,
సుద్దు మరదలు నీతోడ ముచ్చటాడు,
వదినె నీతోడ మాటికి వరుసలాడు,
కలువు దీరఁగ నినుఁ గాంచు తెరువు లేక
తలుపుచాటున నిలిచి నీ తరుణి నిన్ను
నోర చూపులఁ జూచి యుబ్బూత లూచు,
అత్తవారింటి విందులటన్న భార్య
వాలుఁ జూపు కోపులె గాని, వారు పెట్టు
పంచ భక్ష్యము లనుకొని భ్రాంతి పడకు,
ఊరివారలు నీయెడ గారవమున
మన్ననలు సల్పుదురు; నీదు మామ కూడ
నడుగులకు నీకు భృత్యుఁడై మడుగు లొత్తు,
నత్తవారింటి కేగి రావయ్య నీవు. 4

. . . .

రండు మాయింటి కీరు పేరంటమునకు
బొమ్మ లెత్తును మాపిల్ల యమ్మలార!
జడలతోఁ గ్రొత్తవల్లెతో, నడుగులఁబడి
చిందులం ద్రొక్కు పరికిణీ చెలువుతోడఁ
గాళ్ళఁ బారాణి, కాటుకఁ గన్ను గవను
దిద్దికొని, మురిపెమ్మును ముద్దుఁ దొలఁక
నగు మొగమ్ముల తోడఁ గన్యకలు నీకు
నర్చ లొసగఁగ నిలిచి రీ వరుగు నపుడు
వచ్చి పోవమ్మ, మాయింటి పజ్జ కీవు,
పరమ కళ్యాణి, మాతల్లి, సౌమ్య లక్ష్మి!

—శ్రీ సింగళి— శ్రీ కాటూరి.

లఘు టీక

1 ప్రార్థన

ఈ పాఠ్యభాగము బమ్మెర పోతన రచియించిన ఆంధ్ర మహాభాగవతమునందలి గజేంద్రమోక్ష కథా ఘట్టము నుండి గ్రహింపఁబడినది. పోతనను గూర్చి 5 వ పాఠము కడ తెలుపబడును.

జనించు = పుట్టునో. జగము = ప్రపంచము, లీనమై = ఐక్యమై, డిందున్ = అడఁగునో, మూలకారణంబు = ప్రధానకారణము ఆది + మధ్య + లయుఁడు = మొదలు-నడుము-చివర లేనివాఁడు, తాన = తానే, ఆత్మభవున్ = మనసులోఁ బుట్టినవానిని, ఈశ్వరున్ = భగవంతుని, శరణంబు = రక్షణమును. 1

వెలినిడి = బయట ఉంచి, ఉభయమున్ = లోకము యొక్క బయట వ్యాపించుట, లోపల నణఁగుట అను రెండు స్థితులను, సకల + అర్థ + సాక్షి = అన్ని విషయములను పొందక సాక్షిగా ఉండువాఁడు, అకలంకున్ = దోషములు లేని వానిని, ఆత్మమూలున్ = జీవాత్మునికి ప్రధాన కారణమైన వానిని, అర్థిన్ = కోరికతో, భజింతున = సేవించెదను. 2

లోకంబులు = భూలోకము మొదలైనవి, లోకేశులు = లోకములకు అధిపతులైనవారు, లోకస్థులు = లోకములో నుండు జనులు, తెగినన్ = నశింపఁగా, తుదిన్ = కడపట, అలోకంబు = కానరాని, పెంజీకటికిన్ = గొప్ప చీకటికి, అవ్వలన్ = అవతల, ఏక + ఆకృతిన్ = ఒకటే రూపముతో, వెలుగున్ = ప్రకాశించునో, అతనిన = ఆ తేజోమూర్తిని. 3

ముక్త + సంగులు = విడువఁబడిన సంసారము గలవారు. దిదృక్షులు = చూడవలెనను కోరిక గలవారు. సర్వ + భూత + హితులు = అన్ని జీవులకు మేలుగోరువారు. సాధు + చిత్తులు = మంచి మనసుగలవారు, అసదృశ + వ్రత + ఆఢ్యులు = సాటిలేని నియమములు గలవారు, ఎవ్వని దివ్యపదము = ఏ దేవుని మహిమగల పాదమును, కొల్తురు సేవింతురో. 4

యోగ + అగ్ని + దగ్ధ + కర్ములు = యోగము అను అగ్నిచే కాల్పఁబడిన కర్మలు గలవారు (యోగనిష్ఠలో ఉండి ఇతర కర్మములను చేయనివారు) యోగి + ఈశ్వరులు = యోగులలో గొప్పవారు. ఒండు = ఇతరమును, సత్ + యోగ + విభాసిత + మనమునన్ = మంచి యోగములచేత వెలుఁగునట్టి మనస్సులతో, ఏ మహాత్మున్ = ఏ గొప్పవానిని, వీక్షింతురు = చూచెదరో పరమున్ = భగవంతుని. 5

2 సుభాషితములు

ఈ పాఠము భర్తృహరి సుభాషితమునందలి నీతి శతకము లోనిది. ఇది సంస్కృత సుభాషితమునకు ఏనుగు లక్ష్మణ కవి చేసిన ఆంధ్రానువాదము. ఇందు నీతి, శృంగార, వైరాగ్య శతకములు కలవు. ఇతని శైలి సుందరమైనది. సులభమైనది. ఈ మహాకవి 1759 ప్రాంతమున నుండెను. ఈతని గ్రంథములు సుభాషిత రత్నావళి, రామవిలాసము, రామేశ్వర మాహాత్మ్యము మొదలైనవి.

బోద్ధలు = తెలిసినవారు, మత్సర + పూర్ణ + **మతులు** = **అసూయచే** నిండిన బుద్ధిగలవారు, **ప్రభువులు** = రాజులు, ప్రబల + గర్వ + విదూషితుల్ = చాల గర్వముతో **కూడినవారు**, ఎన్నన్ = విచారింపఁగా, అబోధ + ఉపహతులు = **అజ్ఞానముచే** కొట్టఁబడినవారు, **భావమున** = **మనసులో**, సుభాషితము **మంచి** మాట. 1

తివిరి = ప్రయత్నము చేసి, ఇసుమున = ఇసుకలో, తైలమున్ = నూనెను, **తవిలి** = వెంటఁబడి, మృగతృష్ణ = ఎండమావులు, రంజింపరాదు = సంతోష పెట్టలేము. 2

సత్యసూక్తి = సత్యమును పలుకునట్లు, ఘటించు = కలిగించును, ధీజడిమ = తెలివితక్కువ తనమును, కలుషము = **పాపము**, చిత్తవిస్ఫూర్తిన్ = మనస్సునకు వికాసమును, సాధుసంగంబు = మంచివారి స్నేహము, సకల + అర్థ + సాధ**నము** = అన్ని కోర్కెలు నెరవేర్చునట్టిది. 3

ఆపదలందు = కష్టములు వచ్చినపుడు, అంచిత సంపదలు = ఒప్పిన ధనము మొదలైనవి, **తాల్మి** = ఓరుపు, భూపసభ + అంతరాళమున = రాజుల సభలలో, పుష్కల + వాక్ + చతురత్వము = విశేషముగా మాటల నేర్పు, ఆజి = యుద్ధ ములందు, బాహా + పటు + శక్తి = భుజములలో గొప్పబలము, యశము = కీర్తి, **అనురక్తి** = ప్రేమ, వాంఛాపరివృద్ధి = అన్ని విధముల పెరిగిన కోరిక, ప్రకృతి జన్య = పుట్టుకతో (స్వభావముగా) ఏర్పడిన, సజ్జనాళికిన్ = మంచివారికి. 4

భూషితుఁడు = అలంకరించబడినవాడు, వెలయుచున్నన్ = ఒప్పుచున్నప్ప టికిని, తొడరి = పూని, వర్జింపనగు = విడువవలెను. దుర్జనుండు = చెడ్డవాడు. చారు + మాణిక్య + భూషిత + శస్త + మస్తకంబు = సొగసైన మణిచేత అలంకరింపబడిన శ్రేష్ఠమైన తల, పన్నగము = పాము, (వృత్తి) (పదములచే నడువ నిది- పామునకు కాళ్ళుండవు.) 5

అర్కకాంతము = సూర్యకాంతపు రాయి, అచేతనము = జీవశక్తి లేనిది (ప్రాణము లేనిది) సవితృపాదములు = సూర్యుని పాదములు, (కిరణములు) ప్రజ్వరిల్లు = కోపముచే మండును. (బాగ వెలుగును) శత్రు + కృత + తిరస్కా రము = పగవాడు చేసిన అవమానము. 6

విదళింపన్ = చీల్చుటకు, కొదమ = పిల్ల, మద + మలిన + గండ + కుంజరములపై = మదపునీటిచే మురికి అయిన చెక్కిళ్లుగల ఏనుగులమీద, నైజము = పుట్టుకతో వచ్చిన గుణము. తేజోనిధికి = పరాక్రమము కలవానికి. 7

భోగము = అనుభవించుట, భువి = లోకమునందు. 8

తరువులు = చెట్లు, అతి + రస + ఫల + భార + గురుతన్ = ఎక్కువ రసము గల పండ్ల బరువు యొక్క గొప్పతనమును, కాంచు = పొందును, నింగిన = ఆకాశమునందు, అమృతంబున్ = నీటిని, ఉద్ధతులు = గర్వము కల వారు, బుధులు = తెలిసిన వారు. సమృద్ధి = గొప్ప సంపద, ఉపకర్తలు మేలు చేయు వారు, సహజ = పుట్టుకతో వచ్చిన. 9

కార్యమున్ = పనిని, పరిత్యజించియున్ = వదలుకొనియైన, పర + అర్థ + ప్రాపకుల్ = ఇతరులకు ప్రయోజనమును కలిగించువారు, సజ్జనుల్ = మంచి వారు, ఘటించుచున్ = సాధించుకొనుచు, పర + హిత + అర్థ + వ్యాపృతుల్ = ఇతరులకు మేలు కలుగు ప్రయోజనమునకై పాటుపడువారు. అన్య + హిత + అర్థ + ఘాతుక + జనుల్ = ఇతరులకు మేలైన ప్రయోజనమును చెడగొట్టువారు, దైత్యుల్ = రాక్షసులు, (వ్యు-దితికొడుకులు-) వృథా + అన్య + అర్థ + భంగము = తనకు ప్రయోజనము లేకుండ ఇతరుల ప్రయోజనమును పాడుచేయుట, శక్యమే = సాధ్యమా, ఎరికిన్ = ఎవరికైనా. 10

ఆశా + సంహరణము = ఆశను చంపుకొనుట, ఓర్మి = ఓరుపు, మద + త్యాగంబు = పొగరును విడచుట, దుర్దోష + వాంఛా + శూన్యత్వము = చెడుపు చేయుటయందు కోరిక లేకుండుట, బుధ + మత + ఆచారంబు = పెద్దలకు ఇష్టమైన నడవడిక, సత్ + సేవ = ఉత్తములను కొలుచుట, వైశద్యంబు = కపటము లేకుండుట. శత్రు + లాలనము = పగవారిని ప్రేమించుట, మాన్య + ప్రీతి = పూజ్యులయందు ప్రేమ, ప్రశ్రయ + శ్రీ + శాలిత్వము = వినయ సంపదచే ప్రకాశించుట. దీనులు = దిక్కులేనివారు, కృప = దయ, శిష్ట + ఆళికిన్ = పెద్దల సమూహమునకు, ధర్మముల్ = చేయదగినవి. 11

మూషకము = ఎలుక, వివరంబు = బొక్క, కరండ + బద్ధమై = పెట్టెలో బంధింపఁబడినట్టిదై, డస్సిన, అలసిన, వాతన్ — నోటిలో, సంపాతము = పడుట. తొలంగెన్ = పోయెను, బిలంబు = రంధ్రము, ఏతరిన్ = ఎప్పుడైనను. హాని వృద్ధులకు = మేలు కీళ్ళకు, ఎక్కటి = ఒక. 12

3 రాయన బాచఁడు

పాఠ్య భాగము చాటు పద్య మణిమంజరి నుండి గ్రహింపఁబడినది. తెలుగు భాషలో ప్రసిద్ధములైన చాటు పద్యములను సేకరించి తొలిసారి కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు "చాటు పద్య మణిమంజరి" అను పేర ప్రకటించిరి. శ్రీ శాస్త్రిపాదులు సంస్కృతాంధ్రములలో నుద్దండ పండితులు. ప్రామాణిక భాషా చారిత్రక

పరిశోధకులలో ప్రథమ గణ్యులు. చెన్నపురి ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమునను, తిరుపతి వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధక సంస్థ లోను పుస్తక పరిశోధకులుగ పని చేసి విలువగల చారిత్రక విశేషము లను ప్రకటించినారు. ముద్రితాముద్రిత గ్రంథ భాండారము నుండి వీరు అనేక చాటు పద్యములను కూర్చి ప్రకటించి మహోపకారము చేసినారు.

ముప్పది యిద్దరు మంత్రుల సీస మాలికలోఁ బేర్కొనఁబడిన రాయన భాస్కరుఁడు ప్రాచీనులలో లెక్కింపఁదగినవాఁడు. ఆయన మహాదాత. రాయన భాస్కరుని గూర్చి ఎన్నో చాటు పద్యము లున్నవి. వానిలోఁ గొన్ని మాత్రమే ఇందు సేకరింపఁబడినవి. చాటువులనగా గ్రంథములలో గాక ఆయా సందర్భములందు కవులు మనోహరముగ వ్రాసియున్న పద్యములు. వీని కర్తలెవరో చెప్పుట కష్టము. భాస్కర శబ్దభవము బాచ అయినది.

కలయ= పసిండి= బంగారు, ఘంటము= తాటియాకు మీద అక్షరములను వ్రాయు ములికి, సమక్షమందు = ఎదుట, సత్ఫలముగ= ప్రయోజనము కలుగునట్లు, గలుగలు, జలుజలు (ధ్వన్యనుకరణములు) 1

పన్నిద్దరు = పండ్రెండుగురు, భాస్కరులు = సూర్యులు, ఎన్నిక సేయుట = లెక్క పెట్టుట, కల్ల = వట్టిది, మిన్నున= ఆకాశమందు, (విశేషాంశములు) ద్వాదశాదిత్యులు పురాణ సుప్రసిద్ధులు. ఇంద్ర, ధాత, పర్జన్య-త్వష్ట-పూష-అర్యమ-భగ, వివస్వన్త, విష్ణు, అంశుమంత, వరుణ, మిత్ర నాములు. పన్నుగ = ఏర్పాటుచేఁగ. 2

పస = చక్కని. 3

పిదప కాలము = చిన్న వయసు. 4

మంత్రికుల + సంభవ = నియోగి వంశమున బుట్టినవాఁడా!. 5

విశేషాంశములు: శిబి చక్రవర్తి డేగ-పావురముల రూప ములతో దేవతలు తన్ను పరీక్షింపరాగ పావురమునకై తన శరీర మాంసమును గోసియిచ్చెను. కర్ణుఁడు బ్రాహ్మణ వేషముతో వచ్చి యాచించిన ఇంద్రునకు తన పుట్టుకతో కలిగిన వజ్రకవచమును గోసి ఇచ్చెను. ఇంద్రుని కోరికపై దధీచి మహర్షి తన వెన్ను ఎముకను తీసి ఇచ్చెను. అదే వజ్రాయుధమైనది. సర్పమును రక్షించుటకై జీమూతవాహనుఁడు తన ప్రాణములను ధారపోసెను.

నిలింపశాఖి = కల్పవృక్షమా, సురేశ్వర = ఇంద్రుఁడా, యీవిన్ = దాతృత్వములో, చింతామణి = కోరికల నిచ్చు దేవమణి, కోవిద + గ్రామణి = పండితులలో శ్రేష్ఠుఁడు, మతియందు = బుద్ధిలో, సుకుమారతన్ = చక్కదనములో. 6

విశేషాంశములు: దాతృత్వమునకు కల్ప వృక్షమును, చింతామణిని, వైభవమునకు ఇంద్రుని, బుద్ధికి బృహస్పతిని, చక్కదనమునకు జయంతుని పోల్చుట కవి సమయ ప్రసిద్ధము. (ఈ పద్యము ఇంద్రునకు కల్పవృక్షమునకు సంభాషణ జరిగిట్లు చమత్కారముగ వ్రాయబడినది)

సన్నుత లీలన్ = పొగడునట్లు, వదాన్యులు = దానము చేయువారు (దాతలు). 7

మీఁగాళ్ళబంటి = పిక్కలలోతు, పీఁగుదురు = వెనుఁదీయుదురు, అమ్మక్క = ఆశ్చర్యము కలిగినప్పుడు అనుకొను పదము. (అబ్బ! అమ్మమ్మ! ఔరా!) వెరపున = భయముతో, చాఁగి = పొడవై, పయోధులు = సముద్రములు, ఊఁగ అయి = దుడుకుతనము గలదై. 8

4 ఉంగరము

ఈ పాఠము కూచిమంచి తిమ్మకవి రచియించిన "అచ్చ తెనుఁగు రామాయణము" నందలి సుందరకాండము లోనిది. అశోక వనమునందున్న సీతాదేవిని జూచి ఆంజనేయుఁడు శ్రీరాముని ఉంగరమును సమర్పించు ఘట్టము. ఈ రామాయణము అచ్చ తెనుఁగులో వ్రాయఁబడినది.

తిమ్మకవి పీఠాపురము దగ్గర ఉన్న కందరాడ గ్రామ కరణము. ఇతఁడు 18వ శతాబ్దమునందుండిన పీఠాపుర మహారాజగు చిన్న మాధవరావు వలన కవి సార్వభౌమ బిరుదము నందినాఁడు. పీఠాపుర కుక్కుటేశ్వరస్వామి భక్తుఁడై తన గ్రంథములన్నియు నాదేవునకే అంకితమిచ్చిన స్వతంత్రుఁడు. ఈయన కవిత్వము రసవంతము; లలితము. ఇతని రచనలలో అచ్చ తెనుఁగు రామాయణము, రసికజన మనోభిరామము, రాజశేఖర విలాసము, నీలాసుందరీ పరిణయము, శివలీలా విలాసము, సర్పపురీ మాహాత్మ్యము, సర్వ లక్షణ సార సంగ్రహము, రుక్మిణీపరిణయము, కుక్కుటేశ్వర శతకములు ప్రసిద్ధములు.

వలగొని = ప్రదక్షిణముచేసి, కోఁతిమొత్తములు = కోఁతుల గుంపులు. 1

చాన = ఓ స్త్రీ!. ఆనవాలుగ = గుర్తుగా, నలువుగ = ఒప్పిదముగ, రాచూలి = రాజకుమారుఁడు (శ్రీ రాముఁడు). 2

డెందము = మనస్సు, ఇగురొత్త = సంతోషింప, కుందనంపు = బంగారు, అన్ను తలమానికంబు = స్త్రీలలో శిరోమణి అయిన సీత. 3

కడింది పొలసు దిండులు = క్రూరులైన రాక్షసులు, చెట్టలన్ = కీడులచేత, కలంగు = బాధపడు, కతమున = కారణమున ఎకిమీని = యజమానుని యొక్క 4

పొందు = స్నేహము. బెరసె = కలిగెను, అనుచు = పంపు. 5

కడలిన్ = సముద్రమును, మొఱఁగితివి, మోసగించితివి. కలతెఱఁగు = ఉన్నసంగతి నిక్కము = నిజము. 6

అనవుఁడు = అని అడుగగా, చలినట్టు = వాయుదేవుని, 7

తొవలదాయ = కలువలకు పగవాఁడు (సూర్యుఁడు) బిరుసు మగండన్ శూరుఁడను, నెయ్యుఁడ = స్నేహితుఁడను. కూర్చునట్టి = ఇష్టమైనట్టి. 8

మూఁకలతోన్ = సైన్యముతో. 9

సెలవుపెట్ట = ఆజ్ఞ ఇయ్యఁగా, నూల్కొన = ఎక్కువ కాఁగా. 10

పెల్లుగ = గొప్పగా, ఎల్లిట = రేపో, నేటనో = ఈదినమో, తలఁకప = భయపడకుము, బల్లిదపు = బలముగల. 11

ఎఱచి యొరదిండి మన్నియ = మాంసము దినువారల (రాక్షసుల) రాజు (రావణుఁడు) కఱకులు = కఠినపు మాటలు. 12

వచ్చినగోలె = వచ్చినప్పటినుండి, కల్లరి = టక్కరి, తూలి = పోగొట్టుకొ. తద్ద = ఎక్కువగ. 13

ఉమ్మలింపకుము = దుఃఖింపకుము, క్రొందలిరుఁబోఁడి = క్రొత్తచిగురాకు వంటి సౌందర్యము గల సీతాదేవీ!

(వ్యు) హనుమంతుఁడు = హనువు (వెలిదౌడ) గలవాఁడు.
పూట యొకయేఁడుగ (జాతీయము).

అచ్చ తెనుఁగులో తత్సమ పదములుండవు. 14

5 విద్యాభ్యాసము

ఈ పాఠము బమ్మెర పోతన తెలుఁగు సేసిన ఆంధ్ర భాగవత మందలి సప్తమ స్కంధములోనిది. భాగవతమును సంస్కృతములో వేదవ్యాసుఁడు వ్రాసెను. భగవంతుని చరితనుగాని, భక్తుల చరిత్రలనుగాని తెలుపునది భాగవత మనఁబడును. ప్రహ్లాదుని సుగుణములు, భగవద్భక్తి ఇందు వర్ణింపఁబడినవి.

బమ్మెర పోతన సంస్కృత భాగవతము నాంధ్రీకరించెను. ఇతని నివాసము ఓరుగల్లు మండలమందలి బమ్మెర ప్రాంతము. ఇతఁడు క్రీ. శ. పదునైదవ శతాబ్దపు చివరి భాగమున నుండెను. సహజ పాండిత్య విరాజితుఁడనని చెప్పికొన్నాఁడు. దరిద్రుఁడయ్యును తన భాగవతమును నరాంకితము సేయనొల్లక శ్రీరామ చంద్రున కర్పించిన మహాభక్తుఁడు. ఇతని కవిత్వము శబ్దాలంకార యుక్తమై, మృదుమధుర పద గుంఫితమై భక్తిరస ప్రధానమై పాఠకులకు చవులూరించును. ఇతఁడు భోగినీ దండకమును, నారాయణ శతకమును, వీరభద్ర విజయమును వ్రాసెనని కొందరు పండితులనెదరు.

అఖిల భూతములందు = అన్ని జీవులయందు, భంగి = విధము, పొడగన్న = చూచిన, కైవడిన = విధమున, కన్నుదోయికి = రెండు కండ్లకు, అన్య కాంతలు = ఇతర స్త్రీలు, వత్సలత = ప్రేమ, లీలలు = ఆటలు. 1

సంఘంబులై = గుంపులై సత్ + గుణంబులు = మంచి గుణములు, గుణము (ప్రకృతి) గొనము (వికృతి) (నానార్థములు) గుణము-అల్లె త్రాఁడు, అసుర రాజు తనయునందు = రాక్షస రాజు కొడుకైన ప్రహ్లాదుని యందు, పాసి = విడిచి. 2

సంకాశులన్ = సమానులను, సుగుణ + ఉపేతులన్ = మంచిగుణములు కలవారిని, వృత్త + బంధంబులన్ = పద్యములతో, సత్ + కవి + ఇంద్రులు = గొప్ప కవులు, సత్ + భగవత్ + భక్తులు = దేవునియందు ఎక్కువ భక్తి కలవారు. 3

గుణనిధి = మంచి గుణములకు గని గురుకాలమునన్ = చాల కాలమునకైనను, గణుతింపన్ = లెక్కపెట్టుటకు అశక్యంబులు = సాధ్యము కానివి. ఫణిపతికి = ఆదిశేషునకైనను; భాషాపతికిన్ = బ్రహ్మదేవునికిని.

(వ్యా) ఫణి = పడగగలది (పాము) ఆదిశేషునకు వేయి నాలుకలుండుననెదరు. అట్టివానికి గూడ లెక్కపెట్ట సాధ్యము కాదట. 4

గరిష్ఠుడు = గొప్పవాడు, సంవర్ధమాన = పెరుగుచున్న, ధ్యాన + రతుండై = ధ్యానించుటయందు ఇష్టము కలవాఁడై. 5

శ్రీ + వల్లభుఁడు లక్ష్మికి భర్త అయిన విష్ణువు, అసుర + అరి = రాక్షసులకు శత్రువు అయినవాఁడు, మ్రోల = దగ్గర. భక్త + వత్సలుఁడు = భక్తుల యందు, పరభాషలు = ఇతరుల పలుకులు, సురవంద్యు = దేవతలచేత నమస్కరింపఁబడువాఁడు, చొక్కి = ఒడలుమరచి, సమస్తంబు = అన్నిటిని, హరి + పద + అంభోజ + యుగ + చింతన + అమృతమున = భగవంతుని పద్మముల వంటి పాదముల జంట యొక్క ధ్యానము అను అమృతము చేత, అంతరంగము = మనస్సు, జడత = జీవములేని దానివలె ఉండుట. శ్రీ (ప్ర) సిరి (వి) 6

సు + గుణ + మణి + గణ = మంచి గుణములు అను మణుల సమూహముచే. పరమ + భాగవత + శ్రేష్ఠుఁడు = మహాభక్తులలో గొప్పవాడు సుర + విరోధి = దేవతలకు శత్రువు అయిన హిరణ్యకశిపుఁడు. అనుకంప = దయ, పుత్రుఁడు (వ్యు) పున్నామ నరకమునుండి రక్షించువాఁడు. 7

జనకుల్ = తండ్రులు, దురిత + ఉన్మేషంబు = అధిక పాపము. వారింతురు = పోఁగొట్టుదురు, సౌజన్య + రత్న + ఆకరున్ = మంచితనమనెడు సముద్రమును పోలిన వానిని, నెసులున్ = బాధను, మిత్రుఁడు (నా) = స్నేహితుడు- సూర్యుడు. 8

ప్రభా + విశాలున్ = ఎక్కువ కాంతిగలవానిని, హరి + పాద + పయోరుహ + చింతనక్రియా + లోలున్ = విష్ణుదేవుని పద్మములవంటి పాదములను ధ్యానించుటలో మునిగియున్నవానిని, కృపాళు = దయగలవానిని, సాధు + గురులోక + పద + ఆనత + ఫాలున్ = భక్తుల గురువుల పాదములపై తలపెట్టువానిని, నిర్మల + శ్రీలు = స్వచ్ఛమైన నడత గలవాఁడు, సమస్త + సభ్య + నుత + శీలు = మంచివారందరిచే పొగడఁబడు స్వభావము గలవానిని, విఖండిత + మోహావల్లికా + జాలున్ = తీగవలె అల్లుకొన్న మోహమను వలను త్రెంచినవాఁడు.

హరి (నానా) విష్ణువు, సింహము, కప్ప, కోఁతి, గుఱ్ఱము, పాము, పయోరుహము (వ్యు) నీటిలో పుట్టినది. (పద్మము). 10

లభ్యంబైన = దొరికిన, సురాధిరాజ పదమున్ = ఇంద్ర పదవిని, లక్షింపడు = లెక్కపెట్టఁడు, సభ్యత్వమున = మంచితనమున, అబలుఁడై = చేతగానివాడై, జాడ్యంబు = కదలకపడియుండురోగము దైత్యేభ్యుఁడు = రాక్షసరాజు, నీక్షించి = చూచిన + ఉత్కంఠుఁడై = తొందర పాటుతోఁ గూడినవాఁడై. 11

అజ్ఞుడు = తెలియనివాఁడు. సత్ + అసత్ + వివేక + చతురత = మంచి చెడు తెలిసికొను తెలివి-నేర్పు, ఆర్యులు = పూజ్యులు. 12

ప్రచండ + వితర్కులన్ = తీవ్రముగా విమర్శింపఁగలవారిని, సత్కరించి = గౌరవించి. 13

అంధ + ప్రక్రియన్ = గుడ్డి వానివలె, అస్మత్ + ప్రతాపక్రియా + గంధంబు = నాయొక్క పౌరుష కార్యములతో సంబంధము (నేను చేసిన మహా కార్యములను గూర్చిన (జ్ఞానము) కారుణ్య చిత్తుల్ = దయగలవారు, మాన్యులు = గౌరవింపఁదగినవారు, నీతి + కుశలున్ = నీతులను బాగుగా తెలిసివానిని. 14

దనుజ = రాక్షసుల, సవయస్కులు = సమాన వయస్సు గలవారు. సహశ్రోతలన్ = కూడవినువారు, దనుజులు (వ్యు) దనువు వంశమునఁ బుట్టినవారు. 15

అంచిత = ఒప్పునట్టి, దనుజాధిప + గేహ + సమీపము = రాక్షసరాజు ఇంటిదగ్గర, పఠింపించిరి = చదివించిరి, పాఠ + యోగ్యములు = చదువఁదగినవి, ఆలించి = విని, వైష్ణవ + భక్తి + పూర్ణుఁడై విష్ణువుపై సంపూర్ణమైన భక్తిగలవాఁడై. 16

పగిది = విధము, అట్టు + ఇట్టు + అని = అట్లని ఇట్లని, ఆక్షేపింపఁడు = అడ్డుచెప్పఁడు, రూపించిన = తెలిసిన మిథ్యలు = అసత్యములు, నిరూఢ + మనీషన్ = నిశ్చయమైన బుద్ధితో. 17

6 సత్యనిష్ఠ

ఈ పాఠము గౌరనద్విపద హరిశ్చంద్రోపాఖ్యానము లోనిది. గౌరన 15వ శతాబ్ది పూర్వ భాగమున రాచకొండ రాజ్యములో ఉండిన నియోగి బ్రాహ్మణుఁడు. ఇతని శైలి మృదువై జాతీయోక్తులతో, సామెతలతో నిండి చాల సరసముగా నుండును. ఇతఁడు నవనాథ చరిత్రము, హరిశ్చంద్రోపాఖ్యానము అను ద్విపద కావ్యములను, సంస్కృత భాషలో "లక్షణ దీపిక" అను ఛందశ్శాస్త్రమును వ్రాసెను. ద్విపదలు తెలుగుబాసకు మేలి సొమ్ములు.

తలఁదెంపు = తలనునరుకు, తెంపు = ధైర్యము, దలకొనన్ = కలుగఁగా జలజ + అక్షి = కమలమువంటి కన్నులుగల చంద్రమతి, అమర్చి = సవరించి, ప్రాణ + ఈశుఁడు = ప్రాణములకు అధిపతి (భర్త) వలగొని = చుట్టు తిరిగి, ఎరగి = నమస్కారము చేసి, పాణి + పల్లవములు = చిగురువంటి చేతులను, మొగిచి = జోడించి. 1

అనుదిన + రక్త + పంక + అరుణంబు = ప్రతిదినము నెత్తురుబురదచే ఎర్రనైనది, జేవురుగట్టు = ఎర్రకొండ.

చందమునన్ = విధమున, వధ్య + శిల + ఉపరి + స్థలి — చంపుటకు ఏర్పరచిన రాతి పైభాగము, చెన్ను + అతి = అందముగా ఉండి, సెలవిన్ = పెదవిమూలలో. 2

పద్మాసనమున పూజచేయునపుడు భక్తితో కూర్చుండు పద్ధతిలో, పద్మినీ + వల్లభు పై = సూర్యునిమీద, చూడ్కి = చూపు, లోక + లోచన = లోకమునకు కన్నువంటివాఁడా, సర్వ + లోక + ఏక + వంద్య = అన్ని లోకములకు ముఖ్యముగా మ్రొక్కదగినవాఁడా. 3

సతత + పుణ్యుని = ఎప్పుడు పుణ్యము చేయువానిని, భూ + విభుని = రాజును, పార్థివ + ఈశ్వరుని = రాజులకు రాజైనవానిని (చక్రవర్తిని) పార్థివుఁడు (వ్యు) పృథివికి పతి. (రాజు) దీపింపన్ = ప్రకాశించునట్లు. తెఱఁగున = విధముగా. 4

నెల + కొను = నెక్కొను = స్థిరముకాఁగా, వేఁడి = ప్రార్థించి తలఁపు = ఆలోచన, ఒండు = మరొకటి, బంధంబులు = కట్లు, ఊడ్చి = విడిచి, నర + ఇంద్రుఁడు = రాజు, జగద్ + ఆశ్చర్యము = ప్రపంచమునకు వింత. 5

శాత+ధారా +అఖిల+చటుల+ ఖడ్గంబున్ = పదునైన అంచుచేత భయంకరమై చలించు కత్తిని, భూతముల్ = ప్రాణులు. భీతిల్లన్ = భయపడు నట్లు, ముష్టిన్ = పిడికిటిలో, జళిపించి = తళతళలాడించి, జీవిత+ఈశ్వరి = జీవితమునకు నాయిక (భార్య) మోపి= ఉంచి. కలఁగక = దుఃఖింపక, గమ కించునంత = పూనుకొనునంతలో. 6

క్రమ్మఱన్= మరల, ఎడ= నడుమ. చొచ్చి =దూరి, కౌశికుఁడు విశ్వా మిత్రుఁడు. (వ్యు) కుశికుని వంశములో పుట్టినవాఁడు, సాహస+కృత్యము = తెంపుపని. 7

మనుజ+రాక్షసుఁడవు= మనుష్యుని రూపములో ఉన్న రాక్షసుఁడవు, సాధ్వి = ప్రతివ్రత, జన+నుత+సౌందర్య + సంశోభిత + అంగి = జనులచే పొగడఁబడుఅందముచే బాగుగాఒప్పిన అంగములుకలది, భువన+విఖ్యాతమై = లోకములలో పేరుపొంది, పొలుపు= స్థయిర్యము; రవి = సూర్యుని యొక్క రాజసము = దొరతనము. 8, 9

కాడున్ = శ్మశానమును. 10

అడఁపఁడే = అణచివేయఁడా. 11

మగువల= స్త్రీలను, తొంటిపెంపు= మునుపటి గౌరవము 13

పదును= సమయము, తెక్కలిన్ = వంచనతో 14

భవ+సాగరము= సంసారమను సముద్రము, దరి= ఒడ్డు. 15

వేంచేయుము= వెళ్లుము, ఎడ= చోటు, పావన+సత్య+సంపదకు = పవిత్రమైన సత్యము అను సంపత్తునకు, అలరి= సంతోషించి. 13, 17

ఆసల=ఆశలను, (ప్ర) ఆశ (వి) ఆస, పొంకంబు= పొందిక, అంబర వీథిన్= ఆకాశములో, ఉవిదలు= స్త్రీలు, తారు= తాము. 18

బహు+రత్న+దీప్తులన్= చాల రత్నముల కాంతులచేత, భాసిలుచు = వెలుగుచు. మహనీయ= గొప్ప, దివ్య= స్వర్గమునందలి, క్రందుగా= సంద డితో, వెఱఁగంది= ఆశ్చర్యపడి, నెఱదెంపుమై= సంపూర్ణమైన ధైర్యముతో, ధరణీతల+ఈశ్వరుఁడు= రాజు. 19

భిదురంబు= వజ్రాయుధము, జెడిదము= కఠినము= చదలన్= ఆకా శమందు, అదరులు= మిణుగురులు, వామ+అక్షి= అందమైన కన్నులు కలది (స్త్రీ) కంఠనాళము= కుత్తుకలోని నరము. 20

చెన్ను= అందము: పూఁబోడి= స్త్రీ (వ్యు) పూవువంటి మేనుగలది 21

7. తెలంగాణ లక్ష్మి

ఈ పాఠము "సుజాత" పత్రిక తెలంగాణా ప్రత్యేక సంచిక నుండి గ్రహింపఁబడినది. దీనిని శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రి గారు వ్రాసినారు.

శ్రీ నరసింహశాస్త్రిగారు ఆలంపూరు తాలూకాలోని పల్లె పాడు వాస్తవ్యులు. సంస్కృతాంధ్ర ఆం॥ భాషలలో దిట్టమైన

పాండిత్యముగల మధుర కవులు. సహృదయులు. వీరు భావపూర్ణమై ధారాశుద్ధిగల కవిత్వమును సరళ సుందరశైలిలో వ్రాయగల నిపుణులు. ప్రస్తుతము విజయవాడ రేడియో నిలయమునందు తెలుగు శాఖను నిర్వహించుచున్నారు. వీరి రచనలలో ప్రబంధ పాత్రిలు, మధుర నిశీథము, ఉదయసుందరి, సందేశము ప్రసిద్ధములు. వివిధ నాటికలను, శతకములను, వ్యాసములను వ్రాసినారు.

రాజ్యశ్రీ= రాజ్యలక్ష్మి, పౌజు= వరుస, ఖండన+శతములన్= అనేక యుద్ధములందు, అరి+వీర+కంఠముల్= శత్రు వీరుల కంఠములను, వాలు దాల్చి= కత్తిబట్టి, శౌర్య+ బంధుర+ యశంబు = పరాక్రమముచే ఎదిగిన కీర్తిని. 1

వ్యాకీర్ణ = చెదరిన, తరివేచి = సమయముకాచి, ఎదన్= మనసులో ఘూర్ణిల్లు = ఆందోళనపడు, అభయము= (భయము లేదని) రక్షింతునని చెప్పుట. 2

సకల +ఆంధ్ర+ అవనికి= ఆంధ్ర భూమి కంతటికి, శాసనము = ఆజ్ఞ, సామ్రాజ్య+సంస్థాపన+ఉత్సుకుఁడు చక్రవర్తిత్వమును స్థాపించుఉత్సాహముతో కృషి చేయువాఁడు, కాళింగులన్ = కళింగ దేశమువారిని, చకిత+స్వాంతులన్= భయపడిన మనస్సు గలవారినిగా, తక్కు= తక్కిన, దొరలన్ = రాజులను, ముట్టన్= తాఁకుటకు. 3

రిపు+ఘస్మరుఁడు= శత్రువులను చంపువాఁడు, దారుణ మృతి= భయంకరమైనచావు, అరుస్+తుదము= మర్మములను నొప్పించునది, భీషణ+రణ+దుందుభుల్= భయము కలిగించు యుద్ధ భేరీలు, పద్మ నాయకులు = వెలమ రాజులు. 4

తత్త్వ + విద్యా + కలాప = వేదాంత విద్యయే అలంకారముగ కలవాఁడు, కవిత్వ సార = చేవగల కవిత్వము గలవాఁడు జైన + మస్తక + విన్యస్త + శాత+ శూల =జైనమతమువారి తలలమీద ఉంచిన వాడిశూలము కలవాఁడు, కలితబిజ్జుల తలగుండు గండ= బిజ్జలరాజు తల గొట్టు బిరుదుమగఁడు, పై మూడును బిరుదులు. ఇవి పాల్కురికి సోమనాథ కవి వీరశైవ మతాభిమానమును తెలియఁజేయును. 5

పురుడు= సాటి, వెలిగందల+అభిధాన+మండలము= వెలిగందల అను పేరుగల జిల్లా (కరీంనగరము) మండనంబు= అలంకారము. 6

పడుపుఁగత్తె వ్యభిచారముచే బ్రదుకునది (వేశ్య) మృదుబంధము= సుకుమారమైన కావ్యరచనా విశేషము. 7

దక్షిణాధీశ= ప్రౌఢదేవ రాయలచే. రచిత= నిర్మింపఁబడిన, పసిఁడి వానలన్ = బంగారు పూల పూజచేత, ప్రౌఢ కవికి= శ్రీనాథ మహాకవికి, రాంకవంబు= శాలువ. 8

మహిత=గొప్పగాఁ+ సేతు + శీత + అద్రి+కలిత+యశము= సేతువు మొదలుకొని హిమాలయము వరకుగల భూమిలో నిండిన కీర్తి. 9

సకలదేశ= అన్నిదేశములనుండి; సమాగత= వచ్చుచుండు, సుకవి జను లన్= కవిశ్రేష్ఠులను, బహుళ= గొప్ప. 10

వటలి= ప్రకాశించి, బ్రహ్మేశ్వర + ఆఖ్యాన= బ్రహ్మేశ్వరుఁడు అను పేరుగల. పొలుపుమీరును= ఒప్పును. 11

తలచు= చిలుకు, క్రాఁచు= వేడిచేయు, రాణ= ఒప్పినదై. 12

(విశేషాంశములు) తెలంగాణమును శాతవాహనులు, బాదామి చాళుక్యులు, రాష్ట్రకూటులు, కల్యాణి చాళుక్యులు ఏలిరి. తరువాత ఆంధ్ర సామ్రాజ్య స్థాపకులైన కాకతీయుల పాలనలో మహోన్నత దశ ననుభవించెను ఈ చివర వంశములో గణపతి దేవుఁడు, రుద్రమాంబ, ప్రతాపరుద్రుఁడు సుప్రసిద్ధులు.

శ్రీశైలమునకు నాల్గుదిక్కుల నాలుగు ద్వారములు కలవు. తూర్పున త్రిపురాంతకము, దక్షిణమున సిద్ధవటము, పశ్చిమమున అలంపురము, ఉత్తరమున ఉమామహేశ్వరము అనునవి. చివరి రెండును మహబూబ్‌నగరం జిల్లాలోనివి. ఉమామహేశ్వరము అచ్చంపేట తాలూకాలో నున్నది.

8. సంక్రాంతి

ఈ పాఠ్య భాగమును శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారును శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగారును రచియించినారు. వీరిద్దరును సుప్రసిద్ధులగు తిరుపతి వెంకటేశ్వర మహాకవుల శిష్యులు. ప్రఖ్యాతి జెందిన జంట కవులు. వీరిరచన లలిత పదములతో, మధుర భావములతో, జాతీయములతో, ధారాశుద్ధితో నొప్పారుచుండును.

వీరి గ్రంథములలో సౌందరనందము, తొలకరి సుప్రసిద్ధములు. ఈ పాఠమున తెలుఁగు వారికి ముఖ్యమైన సంక్రాంతి వర్ణింపబడినది.

ధినకరుఁడు =సూర్యుఁడు, రేల = రాత్రులందు,
(ఇందు పుష్యమాసము వర్ణింపఁబడినది.) 1

స్నానము (వి) స్నానము (ప్ర), సేలు= చేయు, చిఱుతలు= తాళము వేయు చిన్న పలకలు, అక్షయపాత్ర= భిక్షాపాత్ర. (ఇందు సంక్రాంతి వేళ భిక్ష మెత్తుకొను సాతాని జియ్యరు వర్ణింపఁబడినాడు.) 2

(ధనుర్మాసము వచ్చినప్పటినుండి తెల్లవారుజామున లేచి పేడతో గొబ్బెమ్మలు చేసి పూలుచెక్కి ఇంటిముందు అలికి ముగ్గులు పెట్టినచోట ఉంచుట ఆచారము, ఆడపిల్లలకిది ముఖ్యమైన వేడుక. ధనుర్మాసమనఁగా సూర్యుఁడు ధనూరాశిలో ప్రవేశించిననాటినుండి నెలవరకు ఉండును. సూర్యుఁడు మకర రాశిలో ప్రవేశించిన దినమే సంక్రాంతి పండుగ అగును.) 3

తెరువు= మార్గము. మన్ననలు= మర్యాదలు, పంచభక్ష్యములు= భక్ష్య భోజ్య చోష్య లేహ్య పానీయములు, (భక్ష్యములు = పిండివంటలు. భోజ్యములు= అన్నముతో చేయునవి, చిత్రాన్న-దధ్యోదనాదులు, చోష్యములు = జుర్రుకొనునవి. పులుసు-రసము-మొ; లేహ్యములు = వ్రేళ్ళతో తీసికొని నాలుకకు రాచుకొనునవి- పాయసాదులు. పానీయములు = త్రాగునవి- పానకములు.

మడుగులొత్తు = సేవలుచేయు.

(క్రొత్తగా పెండ్లి అయినవానిని గూర్చి చెప్పఁబడినది.) 4

వలె = బాలికలు పావడపై వేసికొను ముసుగు, పరికిణీ = పావడ-లంగా, పారాణి = స్త్రీలు పసుపుసున్నములతో పాదమునకు చేసికొను అలంకారము, కన్నుగవ = రెండుకండ్లు, మురిపెము = నడకలోని కులుకు, అర్చలు = పూజలు, చెజ్జకు = దగ్గరకు,

(ఇందు పుష్య మాసము అను లక్ష్మీదేవి ఆహ్వానింపబడినది.) 5

వ్యాకరణాంశములు

అక్షర ప్రకరణము:

(1) ఆంధ్రభాషకు ఏబదియారు వర్ణములు గలవు.

(2) అచ్చులు 16: అ.ఆ.ఇ.ఈ,ఉ.ఊ.ఋ.ౠ.ఌ,ఎ.ఏ.ఐ.ఒ.ఓ.ఔ.

(3) హల్లులు 37. క.ఖ.గ.ఘ.ఙ.చ.చ.ఛ.జ.జ.ఝ.ఞ.ట.ఠ.డ.ఢ.ణ త.థ.ద.ధ.న ప.ఫ బ.భ.మ.య.ర.ల.వ.శ.ష.స.హ.ళ.ఱ.

(4) ఉభయములు 3. ం. ః. ఁ (సున్న-విసర్గ-అరసున్న)

(5) వక్రములు 4. ఎ.ఏ.ఒ.ఓ.

(6) వక్రతమములు 2. ఐ ఔ.

(7) స్పర్శములు 27. క.ఖ.గ.ఘ.ఙ,చ.చ.ఛ.జ,జ.ఝ.ఞ,ట.ఠ.డ.ఢ.ణ.త.థ ద.ధ.న,ప.ఫ.బ.భ.మ,

(8) అంతస్థములు 4. య.ర.ల.వ.

(9) ఊష్మములు 4. శ.ష.స.హ.

(10) పరుషములు 6. క.చ.చ.ట.త.ప.

(11) సరళములు 6. గ.జ.జ.డ.ద.బ.

(12) స్థిరములు:-పరుషములు, సరళములు కాని హల్లులన్నియు స్థిరములు.

పద ప్రకరణము:

(1) తెనుఁగున వాడఁబడు పదములు, తత్సమములు అచ్చికములు అని రెండు విధములు.

తత్సమములు:

(2) సంస్కృత, ప్రాకృతసమమగు భాష తత్సమము. (సంస్కృత ప్రాకృత భాషలయందలి ప్రకృతులకు తెలుఁగు విభక్తులు చేర్చి ఉపయోగింపఁబడు పదములు తత్సమములు)

ఉదా — రామః (సం) రాముఁడు (తత్స), సీతా (సం) సీత (తత్స). కారో (ప్రా) కారము (తత్స) జమో (ప్రా) జముఁడు. (తత్స)

(3) ఋ.ౠ, ఌ.ః.ఖ.ఘ.ఛ.ఝ.ఠ.ఢ.థ.ధ ఫ.భ.జ.ఞ.శ.ష. అను అక్షరము లున్న పదములు తత్సమములు.

ఉదా = ఖగము, ఘంట, ఛత్రము, ఫలము, శరము, మొద॥

(4) ప్ర- పరా మొదలగు ఉపసర్గలుకల పదములును, య. చై. జై. అనునవి మొదటఁగల పదములును, రెంటికి మించిన హల్లులు సంయుక్తములైనట్టి అక్షరములున్న పదములును, స్థిరములకు ముందు నున్న ఉండు పదములును తత్సమములు.

ఉదా = ప్రకటన, పరాక్రమము, యాచకుఁడు, చైత్రము, జైత్రుఁడు, వస్త్రము, సింహము, కింశుకము,, మొదలైనవి.

(5) అచ్చికములు మూఁడు విధములు, తద్భవములు, దేశ్యములు, గ్రామ్యములు అనునవి.

తద్భవము ల :

(6) శాస్త్రీయమైన మార్పులతో తెనుఁగున వాడఁబడు సంస్కృత ప్రాకృత శబ్దములు తద్భవములు.

ఉదా = భాషా (సం) బాస (తద్భ) స్నేహము (సం) నెయ్యము (తద్భ) యోధః (సం) జోదు (తద్భ). (పణ్ణాస (ప్రా) పనస (తద్భ).

(7) తద్భవములకే వైకృతములని మరియొక పేరు వికృతి జెందినవి వైకృతములు.

(8) మహాకవులు ప్రయోగించిన వైకృతములనే వాఁడవలెను.

దేశ్యములు: (9) తెలుఁగుదేశమున వ్యవహారములో ఉన్న భాష దేశ్యము.

ఉదా = ఊరు, పేరు, తల్లి, తండ్రి, పాడి, పంట, ఆలు, మొద॥

(10) ఇంగ్లీషు-హిందీ మొదలైన ఇతరదేశ భాషలనుండి గ్రహించి వాడుకొను పదములు అన్యదేశ్యము లనఁబడును.

ఉదా = అసలు, జవాబు. కలము, మోటారు, రోడ్డు, మొద॥

గ్రామ్యములు:

(11) లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యము.

ఉదా = వస్తాడు, పోతాడు. వచ్చేని పొయ్యేని, మొద॥

(12) పూర్వకవులు తమ గ్రంథములలో వాఁడిన పదములు అనింద్య గ్రామ్యములు అట్టివానిని గ్రంథములలో వాఁడవచ్చును.

ఉదా = కలకంఠుఁడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ,కపిలగడ్డము, దినవెచ్చము కపిలజడలు మొద॥

భాషా భాగములు:

(13) తెనుఁగు భాషలోని పదములు అయిదు విధములు. నామ వాచకములు సర్వనామములు, విశేషణములు, క్రియలు, అవ్యయములు అని.

నామ వాచకములు:

(14) మనుష్య, నగర, నదీ, పర్వత, పక్షి, జంతు, వృక్ష, వస్తువుల పేర్లను తెలుపు పదములు నామవాచకములు.
ఉదా॥ రాముఁడు, హైదరాబాదు, గోదావరి, హిమాలయము, చిలుక, ఆవు, మామిడి, పుస్తకము మొద॥

(15) అవి, జాతి, సంజ్ఞా, గుణ, సమూహ, భావ, క్రియా నామ వాచకము లని ఆరు విధములు.

(16) ఒక్కొక్క జాతిని తెలుపునది జాతి నామవాచకము. ఉదా॥ మానవుడు, మృగము, నది, పట్టణము మొ॥

(17) మనుష్యాదుల యొక్క నామమును ప్రత్యేకముగ తెలుపునది సంజ్ఞా నామ వాచకము. ఉదా॥ రాముఁడు, గంగ, ఏనుఁగు, కర్నూలు మొ॥

(18) గుణములను తెలుపునది గుణ నామవాచకము. ఉదా॥ నలుపు-తీపు మొ॥

(19) సమూహమును తెలుపునది సమూహ నామవాచకము.
ఉదా॥ మంద, దండు, గుంపు మొ॥

(20) ఒక వస్తువు యొక్క ప్రాణి యొక్క భావమును తెలుపునది భావ నామ వాచకము. ఉదా॥ పొట్టి సౌందర్యము, మంచితనము మొద॥

(21) క్రియలనుండి పుట్టినది క్రియా నామ వాచకము ఉదా॥ వ్రాఁత. నేఁత మేఁత మొద॥

సర్వనామములు:

(22) నామవాచకములకు బదులుగ ఉపయోగింపఁబడుపదములుసర్వనామములు.
ఉదా = నేను, నీవు- అది. ఆమె, వారు. ఎవరు, ఏది, ఏమి మొద॥

(23) సంఖ్యను తెలుపునది సంఖ్యావాచక సర్వనామము.
ఉదా = ఒకటి, పది, నూరు మొద॥

విశేషణములు:

(24) నామ వాచకములు, సర్వనామముల గుణములను తెలియఁజేయుపదములు విశేషణములనఁబడును.

(25) అవి గుణవాచక, క్రియా, సంఖ్యా విశేషణములని మూడు విధములు.

(26) గుణవిశేషమును తెలుపునది గుణవాచక విశేషణము.
ఉదా = పుల్లని పండు, క్రూర జంతువు.

(27) క్రియల గుణమును తెలుపునది క్రియా విశేషణము.
ఉదా = వేగముగా పరుగెత్తెను, చక్కఁగా పాడెను.

(28) క్రియల నుండి పుట్టిన విశేషణము క్రియాజన్య విశేషణము,
ఉదా = తినుచున్న బాలిక, పోవుచున్న బాలుఁడు.

(29) సంఖ్యను తెలుపునది సంఖ్యా విశేషణము.
ఉదా = ముగ్గురు బిడ్డలు, రెండు కన్నులు.

(30) ఒక్కొక్కసారి నామవాచకములే విశేషణములగును. అట్టి వానిని "నామవాచక విశేషణము" అందురు.
ఉదా = గంగానది, నలచక్రవర్తి, గోలకొండ పట్టణము.

క్రియలు:

(31) నామవాచకాదులు చేయు పనులను తెలుపునవి క్రియలనఁబడును.

(32) క్రియలు సమాపకములు, అసమాపకములు అని రెండు విధములు.

(33) వాక్యార్థమును పూర్తి చేయునది సమాపక క్రియ.
ఉదా = రాముఁడు సీతను పెండ్లాడెను, పిల్లి పాలు త్రాగెను.

(34) వాక్యార్థమును పూర్తి చేయనిది అసమాపక క్రియ.
ఉదా = రంగఁడు బడికి పోయి, మొద॥

(35) కర్తలను బట్టి క్రియలకు ఉత్తమ, మధ్యమ, ప్రథమలని మూఁడు పురుషములు కలవు.

(36) తన్నుఁగూర్చి చెప్పునది ఉత్తమ పురుషము, ఎదుటి వానిని గూర్చి తెలుపునది మధ్యమ పురుషము, ఇతరుని గూర్చి తెలుపునది ప్రథమ పురుషము అనఁబడును.

		ఏకవచనము.	బహువచనము
ఉదా =	ఉత్తమ పురుషము.	చూచితిని	చూచితిమి.
	మధ్యమపురుషము	చూచితివి	చూచితిరి.
	ప్రథమపురుషము	చూచెను	చూచిరి.

(37) భూత, వర్తమాన, భవిష్యత్, తద్ధర్మము అని కాలములు నాలుగు విధములు.

(38) జరిగిన పోయిన దానిని తెలుపునది భూతకాలము. ఉదా = చదివెను, తినెను.

(39) జరుగుచున్న దానిని తెలుపునది వర్తమాన కాలము. ఉదా = చదువుచున్నాఁడు, తినుచున్నాఁడు.

(40) ముందు జరుగబోవుదానిని తెలుపునది భవిష్యత్ కాలము. ఉదా = చదువగలఁడు, తినఁగలఁడు.

(41) పై మూఁడు కాలములందును ఒకటిగా నుండు స్వభావమును తెలుపునది తద్ధర్మకాలము. ఉదా = చదువును, తినును.

అవ్యయములు:

(42) ఏవిధమైన మార్పును పొందని పదములు **అవ్యయములనఁబడును.** వానికి లింగ, వచన, విభక్తి, పురుషలుండవు.

(43) అవి లాక్షణికములు, ప్రతి పదోక్తములు అని రెండు విధములు.

(44) లక్షణముచే సిద్ధమైన అవ్యయములు లాక్షణికములు (అసమాపక క్రియలు అవ్యయములగును) ఉదా = తిని, తినక, వెళ్ళి, వెళ్ళక, మొద॥

(45) స్వభావ సిద్ధములై అవ్యయములు ప్రతి పదోక్తములు- ఉదా=పిమ్మట, ఎప్పుడు, మిక్కిలి, మొద॥

లింగములు:

(46) స్త్రీపురుష జడ భేదమును దెలుపునది లింగము.

(47) సంస్కృతమునందువలె లింగము శబ్దమునాశ్రయింపక తెలుఁగున నర్థము నాశ్రయించి యుండును.

(48) ఆంధ్రమునందు లింగములకు వాచకములని పేరు. అవి మహద్వాచకము, మహతీవాచకము, అమహద్వాచకము అనఁబడును.

(49) మగవారిని దెలుపుపదములును, వాని విశేషణములును మహద్వాచకములు ఉదా= పోతన. సేనాని, కవి, మొద॥

(50) స్త్రీజాతిని దెలుపుపదములును; వాని విశేషణములును మహతీ వాచకములు-ఉదా॥ సీత. కన్యక, మొద॥

(51) జంతువులు, జడములు. మొదలైన వానిని దెలుపు పదములు అమహద్వాచకములు. ఉదా॥ భారతము, బాణము, రాజధాని. మొద॥

వచనములు :

(52) ఒకటికిని, ఒకటికంటె నెక్కువకును గల భేదమును తెలుపునది వచనమనఁబడును. ఏకవచనము, బహువచనము అని రెండు భేదములు కలవు.

(53) ఒక దానిని దెలుపునది ఏకవచనము, ఉదా॥ రాముడు, స్త్రీ- మొద॥

(54) అనేకములను దెలుపునది బహువచనము. ఉదా॥ రాములు - స్త్రీలు-మొద॥

(55) సామాన్యముగా ఏకవచన రూపము చివర "లు" చేర్చుటవలన బహువచనమేర్పడును.

(56) కొన్ని పదములకు బహువచనము నందనేక రూపములు గలవు. ఉదా = మ్రానుࠀ+లు = మ్రాఁకులు, కొలను+లు = కొలంకులు, ఆవు+లు = ఆవులు—ఆలు. అల్లుఁడు+లు = అల్లురు, కాలు+లు = కాళ్ళు, గోరు+లు = గోళ్ళు, వేఁటకాఁడు+లు = వేఁటకాండ్రు-వేఁటకాఁలు ఆలు+లు=ఆండ్రు. త్రాడు+లు = త్రాడులు-త్రాళ్ళు, పెండ్లి+లు = పెండ్లిండ్లు మొద॥

(57) కొన్ని పదములకు బహువచనము లేదు. ఉదా = పైడి, వెండి. కేలు, మొన్న, నిన్న, రేపు, మాపు,

(58) కొన్నిటికి ఏకవచనములేదు. ఉదా = ఇరులు, కురులు, వడ్లు, పెసలు. మొద॥

విభక్తులు:

(59) **వాక్యములోని** పదముల యొక్క సంబంధమును దెలుపునది విభక్తి యనం బడును. వీనికే విభక్తి ప్రత్యయములని పేరు. ఇవి యేడు విధములు. సంబోధన ప్రథమా విభక్తి మరొకటి కలదు.

డు-ము-వు-లు-	ప్రథమా విభక్తి.
నిన్-నున్-లన్-కూర్చి-గురించి.	ద్వితీయా విభక్తి.
చేతన్-చేన్-తోడన్-తోన్.	తృతీయా విభక్తి.
కై-కొఱకున్.	చతుర్థీ విభక్తి.
వలనన్-కంటెన్-పట్టి-నుండి.	పంచమీ విభక్తి.
కిన్-కున్-యొక్క-లోన్-లోపలన్,	షష్ఠీ విభక్తి.
అందున్-నన్-	సప్తమీ విభక్తి.
ఓ-ఓరీ-ఓయీ-ఓసీ-	సంబోధన ప్రథమా విభక్తి.

ఔపవిభక్తికములు:

(60) విభక్తులకు సాయముగా వచ్చు "ఇ-టి-ంటి-తి," అనునవి ఔపవిభక్తిక ములనంబడును,

(61) ఇవి ద్వితీయాద్యేకవచనములు పరముగునపుడు కొన్నింటికి ఆగమములుగను, కొన్నింటికి ఆదేశములుగను. కొన్నింటికి పర్యాయమున రెండు విధములుగను తఱచుగ వచ్చును. ఉదా = కాలు + నిన్ = కాలినిన్ (ఇ) త్రాడు + తోన్ = త్రాటితోన్ (టి) ఇల్లు + నిన్ = ఇంటినిన్ (ంటి) చేయి + నిన్ = చేతినిన్ (తి) రెండు + నిన్ = రెంటినిన్ (టి- ఆదేశముగ వచ్చినది) రెండు + నిన్ = రెండింటినిన్ = (ఆగమము)

సంధులు:

(62) **అచ్చునకు** అచ్చు పరమైనపుడు పూర్వమందున్న అచ్చుపోయి పరమందున్న అచ్చు చేరుట సంధియనంబడును.

(63) స్త్రీ వాచకములయు, తత్సమ శబ్దములయు, సంబోధనములయు, నిశ్చయార్థకములయు "అ" కారమునకు సంధి రాదు.

(64) సంధిలేనిచోట స్వరంబుకంటెం, బరమైన స్వరంబునకు యడాగమంబగు. (య్ ఆగమముగ వచ్చును) ఉదా = అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను, హంస + ఏది = హంసయేది, రాముండ! + ఇటు = రాముండ! యిటు, అతండ + అర్జునుండు = అంతడ యర్జునుండు.

అచ్సంధులు:

(65) అత్తునకు సంధి బహుళము. (బహుళమనంగా కొన్ని చోట్ల వచ్చుట, కొన్ని చోట్ల రాకుండుట, కొన్నిచోట్ల నొకమాఱు వచ్చుట యొకమాఱు రాకుండుట) ఉదా = రామ + అయ్య = రామయ్య, పాప + ఎచట || పాపయెచట, మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు.

(66) అన్నాదులు పరమగునపుడు నామవాచకముల యొక్క, మధ్యమపురుషల యొక్క ఇ కారమునకు సంధినిత్యముఉదా = దాసరి + అన్న = దాసరన్న, జానకి + అమ్మ = జానకమ్మ, వచ్చితివి + ఇపుడు = వచ్చితివిపుడు—వచ్చితిపుడు.

(67) ఏమ్యాదుల యొక్క, ప్రథమ-ఉత్తమ పురుషక్రియల యొక్క ఇ కార మునకు సంధి వైకల్పికము. ఉదా = ఏమి + అంటవి = ఏమంటివి-ఏమియంటివి, అది + ఎట్లు = అదెట్లు—అది యెట్లు, వచ్చిరి + అమరులు = వచ్చిరమరులు-వచ్చిరియమరులు, చేసితిమి + ఇపుడు = చేసితిమిపుడు—చేసితిమియిపుడు.

(68) క్త్వార్థకముల యొక్క, తత్సమముల యొక్క "ఇ" కారములకు సంధి రాదు. ఉదా = చేసి + అనెను = చేసియనెను, కవి + అతఁడు = కవియతఁడు, (కవతఁడు అనరాదు,)

(69) ఉత్తునకు అచ్చుపరంబగునపుడు సంధినిత్యము. ఉదా = దానవుఁడు + ఎవ్వఁడు = దానవుఁడెవ్వఁడు, వారు + ఉండరు = వారుండరు, బాగు + అగు = బాగగు.

(70) ప్రథమేతర విభక్తుల యొక్క, శత్రర్థక చువర్ణకము యొక్క 'ఉ' కారమునకు అచ్చుపరంబైనపుడు సంధి వైకల్పికము, ఉదా = నన్నున్ + అడిగె = నన్నడిగె-నన్నునడిగె, నాకొఱకున్ + అడిగె = నాకొఱకడిగె నాకొఱకునడిగె, నాకున్ + ఇచ్చె = నాకిచ్చె— నాకునిచ్చె, వానియందు + అట్టి = వానియందట్టి— వానియందునట్టి, చూచుచున్ + ఏఁగెను = చూచుచు నేఁగెను—చూచుచేఁగెను.

త్రికసంధి;

(71) అసంయుక్తములైన కొన్నిహల్లులు పరమగునపుడు "ఆ-ఈ-ఏ" అను వానికి హ్రస్వమును, పరమైన హల్లునకు ద్విత్వమును వైకల్పికముగనగును. (త్రికమనఁగా ఆ-ఈ-ఏ.అనునవి)ఉదా = ఆ + చోటు = అచ్చోటు-ఆచోటు ఈ + జగము = ఇజ్జగము—ఈజగము, ఏ + కడ = ఎక్కడ-ఏకడ,

(72) త్రికమునకు "శ-ష-స-హ-ర" అనునవి పరమగునపుడు సంధిరాదు, ఉదా = ఆ + శబ్దము, ఆ శబ్దము ఈ + షండుకు = ఈ షండుడు ఈ + సంగతి = ఈ సంగతి ఏ + హాయము = ఏహాయము, ఈ + రమణి = ఈరమణి,

హల్సంధులు:

(73) ప్రథమమీఁదను, కళలైన అవ్యయములమీఁదను, కళలగు క్రియాపదముల మీఁదను ఉండు "క-చ-ట-త-ప"లకు "గ-స-డ-ద-వ"లు వైకల్పికముగ ఆదేశములగును. ఉదా = గుణంబు + కలిగిన = గుణంబు గలిగిన-గుణంబు కలిగిన, అట్లు + తలఁచె = అట్లుదలఁచె- అట్లుతలఁచె, ఎఱుంగమి + పెట్టరె = ఎఱుంగమి వెట్టరె-ఎఱుంగమి పెట్టరె.

(74) కళలగు తెలుఁగుపదముల మీఁది తత్సమపరుషములకును, నిశ్చయార్థక, క్త్వార్థక, సంబోధనలమీఁది పరుషములకును "గ-స-డ-ద-వ"లు తఱచుగ, రావు-ఉదా= అది+తథ్యము, తాన+చనియెన్= తానచనియెన్ చూచి+తగినట్లు= చూచి తగినట్లు, తల్లీ!+ కాపాడుము= తల్లీ! కాపాడుము.

దృతప్రకృతికములు-కళలు:

(75) ఆంధ్ర మందలి పదములు ద్రుతప్రకృతికములు, కళలు అని రెండు విధములు (ద్రుతమనఁగా నకారము).

(76) ద్రుతము అంతమందుండునది ద్రుతప్రకృతికము-అది లేనిది కళ.

(77) ద్రుతాంతములు; ప్రథమా విభక్తి, కై-పట్టి-యొక్క, ప్రత్యయములు తప్ప తక్కిన వన్నియు ద్రుతాంతములు.

సర్వనామములలో

నేను-తాను అను ప్రథమా విభక్తులును-

అవ్యయములలో

అంతన్, అంతటన్, అయ్యున్, అవలన్, ఇఁకన్, ఎడలన్, కడున్, కానన్ కూడన్, క్రిందన్, చాలన్, చోన్, తప్పన్, తరువాతన్, దాఁకన్, పగిదిన పయిన్, పిదపన్, పోలెన్, మఱలన్, మాడ్కిన్, మిగులన్, మీఁదన్, రీతిన్, వలెన్, వఱకున్, మొదలైన అంతాదులును.

సముచ్చయములును:

ఉన్ (రాముఁడు+ఉన్= రాముఁడున్.)

అసమాపక క్రియలలో

వ్రాయుచున్, వ్రాయుడున్, వ్రాయన్, వ్రాసినన్, మొదలైనవియును—

సమాపకక్రియలలో

ని-ను-అంత మందుగల క్రియలును- రక్షించుతన్, కావుతన్, మొదలైనవియును ద్రుతప్రకృతికములు,

కళలు:

(78) ద్రుతము అంతమందు లేని పదములు కళలు, విభక్తి ప్రత్యయములలో డు, ము, వు, లు, కై, పట్టి, నుండి, యొక్క ప్రత్యయములు కళలు. సంబోధనలు గూడ ప్రథమా విభక్తిలో జేరును,
అంతాదులుగాని అవ్యయములును, (అక్కట ఆహా, ఔరా, భళీ, అట్లు, ఇట్లు. అంట, ఏల, ఊరక, మిన్నక, ఇదిగో, మొదలైనవి.)
అసమాపక క్రియలలో అని, విని, చదివి, అనక, వినక, చదువక, చూడక, మొదలైనవియును కళలు.

(79) ద్రుతప్రకృతికములమీఁది క, చ, ట, త, ప, లకుఁ గ్రమముగా గ, జ, డ, ద, బ లు ఆదేశమగును.

(80) ఆదేశమైన "గ-జ-డ-ద-బ"లకు ముందున్న ద్రుతములకు ఖండబిందు, పూర్ణబిందు, స్వత్వ. సంశ్లేషములు విభాషనగు.

ఉదా= విచ్చెన్ + కమలము = విచ్చెఁగమలము- విచ్చెంగమలము, విచ్చెను గమలము, విచ్చెన్గమలము. మొద॥ (విచ్చెన్ గమలము అనియు వ్రాయ వచ్చును-)

సంస్కృత సంధులు:

(81) సవర్ణ దీర్ఘసంధి— హ్రస్వదీర్ఘములగు "అ-ఇ-ఉ-ఋ"లకు మఱల నవియే పరమైనచో దీర్ఘము ఆదేశమగును

ఉదా= వనజ + అక్షుఁడు= వనజాక్షుఁడు, ముని + ఇంద్రుఁడు= మునీంద్రుఁడు, రఘు + ఉత్తముఁడు= రఘూత్తముఁడు, పితృ + ఋణము= పితౄణము- మొద॥

గుణసంధి—

(82) అ-ఆలకు హ్రస్వదీర్ఘములగు "ఇ-ఉ-ఋ"లు పరమైన "ఏ-ఓ-అర్" ఆదేశమగును.

ఉదా= నర + ఇంద్ర= నరేంద్ర, సూర్య + ఉదయము= సూర్యోదయము, మహా + ఋషి = మహర్షి, మొద॥

వృద్ధిసంధి—

(83) అకారమునకు "ఏ, ఐ, ఓ, ఔ"లు పరమై ఐ, ఔలగును. ఉదా= కుల + ఏక= కులైక, మహా + ఐశ్వర్యము= మహైశ్వర్యము. నాక + ఓకస= నాకౌకస, గంధక + ఔషధము= గంధకౌషధము మొద॥

యణాదేశ సంధి—

(84) "ఇ-ఉ-ఋ"లకు సవర్ణములుకాని అచ్చులు పరములైౖ "య-వ-ర" వర్ణములగును-

ఉదా= ప్రతి + ఉత్తరము= ప్రత్యుత్తరము, గురు + అంశ= గుర్వంశ, పితృ + ఆజ్ఞ= పిత్రాజ్ఞ.

వాక్యప్రకరణము:

1) పరిపూర్ణమైన అర్థమును బోధించు ఒక పదముగాని, కొన్ని పదముల కూడికగాని "వాక్య" మనఁబడును.

ఉదా= పో, నిలువుము, పశు తెగులును.

(2) వాక్యము లాక్షణికముగ సామాన్య, సంశ్లిష్ట, మహా వాక్యములని మూఁడు విధములు.

(3) ఒక సమాపక క్రియతోఁ గూడి యుండినది సామాన్య వాక్యము.
ఉదా= ఇచట సుఖనిద్ర పొందితిని.

(4) ప్రధానవాక్యమును, దానికిఁ గౌణ భూతమైన యప్రధాన వాక్యమును కలిసి "సంశ్లిష్ట" వాక్యమగును.
ఉదా= తిక్కన భారత రచనా వ్యాజమున ఆనాఁటి తెలుంగుల సాహసములను చాటెను.

(5) అసంపూర్ణములు, అవాంతరములు, సంపూర్ణములు నగు కొన్ని వాక్యముల కూడిక "మహావాక్య" మనఁబడును.
ఉదా= రాయంచ కన్నీరొలుకఁ బలికిన, నృపాలుఁడు కృపాళుండై హస్తపల్లవంబు వదలి "రాజహంసంబ! పొమ్ము సుఖంబుండుము" అని విడిచిపుచ్చె.

సమాసములు:

(6) వేఱు వేఱర్థములు గల పదములు రెంటినిగాని, ఎక్కువను గాని ఒక యర్థము వచ్చునట్లు ఒకటిగాఁ జేర్చినచో సమాస మనఁబడును. ఉదా= దిన + రాజు = దినరాజు,

(7) పదముల సంబంధమును దెలిపెడి విభక్తులు లోపింపని పదసమూహము విగ్రహమనఁబడును. ఉదా= దినమునకు రాజు. (విగ్రహము సమాసార్థమును వివరించును.)

(8) సమాసము లాఱు విధములు. "తత్పురుషము, కర్మధారయము, ద్విగువు, బహువ్రీహి, ద్వంద్వము, అవ్యయీ భావము" అనునవి.

తత్పురుషము—

(9) రెండవ పదము యొక్క అర్థము ప్రధానముగాఁ గలది తత్పురుషము-

(10) ప్రథమాది విభక్తి ప్రత్యయములుగల పదములు మీది పదములతో సమసించుటచే నాయేడు తత్పురుష భేదములగును. (విగ్రహమున మొదటి పదమున కేవిభక్తి యుండునో ఆతత్పురుష మగును.)

ఉదా= ప్రథమా తత్పురుషము— పూర్వ (ము) కాయము (నకు).
ద్వితీయా " — నెల (ను) తాల్పు.
తృ త- — విద్యా (చేత) నిపుణుఁడు,
చ- త- — ధనాశ (కొఱకు ఆశ).
పంచమీ- త — దొంగ (వలని) భయము,
షష్ఠీ- త — రాముని (యొక్క) దయ.
సప్తమీ- త — పతి (యందు) భక్తి.

(11) అ, అన్, అనునవి సమాసము మొదట నుండి వ్యతిరేకార్థమును బోధించిన "నఞ్ తత్పురుష"మగును.

ఉదా= అసాధ్యుఁడు, అనుచితము,

(12) విభక్తులు లోపింపని సమాసము "అలుక్సమాసము"

ఉదా= నీతోడి చెలిమి, పంకేజము.

కర్మధారయము:

(13) విశేషణము విశేష్యముతోఁగలియుట కర్మధారయ మనఁబడును, ఉదా= తెల్లగుఱ్ఱము, మంచి బాలుఁడు,

(14) కర్మధారయమున లోపింపని ప్రథమా విభక్తి ప్రత్యయమగు "ము" వర్ణకమునకు "పు-ంపు" అనునవి ఆదేశములగును.

ఉదా= సరసము + మాట = సరసంపుమాట, సరసఁపుమాట,

(15) కర్మధారయసమాస మెనిమిది విధములు.

ఉదా= విశేషణ పూర్వ పదము— లేఁబచ్చిక. పరమభాగవతులు
విశేషణోత్తర పదము— మృగధూర్తము,
విశేషణోభయ పదము— మృదుమధురము.
ఉపమానపూర్వ పదము— తేనెమాటలు.
ఉపమానోత్తర పదము— పాదపద్మములు.
సంభావనా పూర్వపదము— లంకాద్వీపము.
అవధారణా పూర్వపదము— విద్యాధనము-ముఖచంద్రుఁడు.
మధ్యమ పదలోప కర్మధారయము—ఛాయా తరువు, వంటకుండలు,

బహువ్రీహి—

(16) సమాస మందలి తుదిపదము చివర "కలవాఁడు, కలది" అనుఅర్థము వచ్చుచుండునది బహువ్రీహి సమాసము.

ఉదా= శుష్కజలము (ఎండిపోయిన నీరుకలది) పీతాంబరుఁడు (పసుపు పచ్చని వస్త్రము కలవాఁడు.)

ద్వంద్వసమాసము—

(17) ఉభయ పదార్థ ప్రధానము ద్వంద్వము.

ఉదా= రామ లక్ష్మణులు, కూరగాయలు, ధర్మజభీమార్జున నకుల సహదేవులు.

ద్విగువు:

(18) సంఖ్యా పూర్వకము ద్విగువు- ఉదా= త్రిమూర్తులు, ముల్లోకములు,

(19) మొదటి పదము అవ్యయమై దాని యర్థము ప్రధానమైనది అవ్యయీభావము. ఉదా= నిర్జనము, కడుదూరము,

(20) భిన్న సమాన రూప పదముల నేకశేషము ఏకశేష సమాసమనఁ బడును.

ఉదా= (మాత + పిత)= పితలు, (రాముఁడు + రాముఁడు=) రాములు.

పద దోషపరికరణము:

(1) తెలుఁగు పదముల మొదట "య-వు-వూ-వొ-వో-ఙ-ళ-"లు ఉండరాదు.

ఉదా= యంత, వుప్పు, వొకటి, వోర, మొద॥

(2) ప్రథమా విభక్తి "ము" వర్ణమును బిందువుగా వ్రాయుట.

ఉదా= కలం, ఫలం, నసం, మనం,

(3) ఒత్తులు తాఱుమాఱు చేయుట. ఉదా= ధారము, బేధముభోద.

(4) ధాతువులోని యకారమునకు సకారము వ్రాయుట. ఉదా= వ్రాసుట, కోసుట.

(5) ప్రార్థనార్థకములను వ్యతిరేకార్థములుగా వ్రాయుట.

ఉదా= చేయ మనియె, (చేయుసనియె ఒప్పు) తినమనియె.

(6) లఘు రేఫద్విత్వమును వాడుట, ఉదా= గుర్రము-కర్రి-మర్రి,

(7) "అ" కార "ఎ" కారములను తాఱుమాఱు చేయుట.

ఉదా= చెరిత్ర- (చరిత్ర-ఒప్పు) కొంచము (కొంచెము ఒప్పు-)

(8) "శ-ష-స"లను తాఱుమాఱు చేయుట- ఉదా= సిరసు, ఇస్టము

(9) వట్టువసుడి తప్పుచేయుట. ఉదా= క్రుప- (కృప) క్రూరము, (క్రూరము) సంస్క్రుతము. (సంస్కృతము.)

(10) ఔపవిభక్తికములను పాటింప కుండుట. ఉదా= నేయికై, గోయిలో.

(11) కొనికి "క" వ్రాయుట. ఉదా= పట్టుక- (పట్టుకొనిఒప్పు) తీసుక.

(12) సర్వనామములు తప్పుగా వ్రాయుట. ఉదా= అతను, వాటిని (వానిని ఒప్పు.)

(13) స్ఫుటమైన ఉచ్చారణను గ్రహింప లేకుండుట.

ఉదా= గ్రంధము (గ్రంథము) ప్రధమ (ప్రథమ) అగ్న, గ్నానము. (ఆజ్ఞ, జ్ఞానము). ఇట్టి దోషములు చేయరాదు.

వాక్య దోషములు:

(14) ఉకారాంతము పై యడాగమము సేయుట. ఉదా= వాడు యేగెను.

(12) ద్రుతప్రకృతికముమీద యడాగమము-ఉదా= వచ్చెయతఁడు.

(13) కళలమీద నకారాగమము- ఉదా= ఏలనన, పోకనుండెను.

(14) క్త్వార్థక ఇకార సంధి- ఉదా= తెచ్చిచ్చెను. చేసడిగెను.

(15) పునరుక్తి దోషము- ఉదా= హిమాచల పర్వతము.

(16) లింగవచనములను తప్పుగా వ్రాయుట- ఉదా= స్త్రీలు కడుశూరులు, బలిష్ఠమగు గుఱ్ఱాలు.

(17) కేవల సంస్కృతపదములను తెనుఁగు పదములతోసమసింపఁ జేయుట ఉదా= పంచరంగులు, దురలవాటు.

విరామసంజ్ఞలు:

(1) భావము సులభముగ బోధ పడుటకు వాక్యాదుల చివర తగినవిధముగ విరామసంజ్ఞల నుపయోగింపవలెను.

(,) విరామ చిహ్నము- అన్వయమునందు సమీప సంబంధము కలిగియు నించుక సేపు నిలుప వలసిన చోట నీగురుతును వాడవలెను.

ఉదా= సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్రములుఆకాశము నలంకరించును.

(;) అర్ధబిందువు:- సమాపక క్రియల సంబంధమునకు నిలుపునపుడు వాడవలెను.
ఉదా= నీటియందు బెండ్లుతేలును; కాని గుండ్లు తేలవు,

(.) బిందువు:- సంపూర్ణవాక్యము చివర ఈ గుర్తును వాడవలెను.

ఉదా= పాపమునకు భయపడుము.

(?) ప్రశ్నార్థకము:- ప్రశ్నార్థక వాక్యము చివర నీ గుర్తు నుపయోగింప వలెను. ఉదా= ఎవరక్కడ?

(!) రాగ చిహ్నము:- ఆశ్చర్యము, దుఃఖము మొదలగు వానిని తెలుపు పదముల, వాక్యముల చివర నీ గుర్తువాడవలెను.

ఉదా= అ! ఇవియేటిమాటలు!, అయ్యో ఎంతమంచి వాఁడు!

" "అనువాద చిహ్నము=— ఇతరుల మాటలను, సామెతలను తెలుపునపుడు వానికిరుప్రక్కల నీగుర్తులుండవలెను.
ఉదా= "జీవన్ భద్రాణి పశ్యతి" అనవినమే.